www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 82 గురువారం, ఆగస్టు 06, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## మళ్లీ కీలక వడ్డీరేట్లను మార్చని ఆర్‌బీఐ

రెపో రేటు 5.25 శాతంగానే కొనసాగించిన ఆర్‌బీఐ

ద్రవ్య విధానంలో తటస్థ వైఖరి

ఎస్‌డీఎఫ్ 5%, ఎంఎస్ఎఫ్, బ్యాంక్ రేటు 5.5%గా కొనసాగింపు

ప్రపంచ వాణిజ్య అనిశ్చితిపై ఆర్‌బీఐ ఆందోళన

దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందన్న ఆర్‌బీఐ



2లో.

## తుమ్మిడిహెట్టికి అనుమతులు
# ఇప్పించండి..



తుమ్మిడిహట్టి పెంపునకు ఒత్తడి తెండి

మహారాష్ట్రను ఒప్పించే బాధ్యత తీసుకోండి

కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ వినతి

అటవీ పర్యావరణ అనుమతలుపై భూపేంద్రయాదవ్‌తో చర్చ

ప్రధాని మోడీని తిడితే కేసు పెట్టామని వెల్లడి

బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్న

**న్యూఢిల్లీ, ఆగస్టు 5 :**
తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోవాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కోరారు. 148 మీటర్ల ఎత్తు నిర్మాణానికి గతంలోనే ఆ రాష్ట్రం అంగీకరించిన విషయాన్ని సీఎం వివరించారు. 150 మీటర్ల ఎత్తుతో నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. **మిగతా 2లో...**

## తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు
# రద్దుచేసే కుట్ర

గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఎపికి అనుకూల నిర్ణయాలు

18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి హరీష్ రావు

**హైదరాబాద్,ఆగస్టు 5 :**
ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించిన తర్వాత వాటిని సమీక్షించి రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో సాధించిన తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే దిశగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఒక ఉద్యమకారుడిగా ఈ పరిణామాలను చూస్తుంటే తనకు కడుపు రగులుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యం **మిగతా 2లో...**



## తెలంగాణలో ఎమర్జెన్సీకి ఇక ఒకే నంబర్..

### డయల్ 112తో అన్ని సేవలు

ఒకే నంబర్‌తో పోలీస్, అంబులెన్స్, ఫైర్ సేవలు

హైదరాబాద్‌లో కొత్త కాల్ సెంటర్‌ను ప్రారంభించిన డీజీపీ

కాలర్ లొకేషన్‌ను గుర్తించి వెంటనే ఆయా సేవలకు సమాచారం

సమీప బృందాలు వెంటనే ఘటనాస్థలికి చేరుకునేలా చర్యలు

ఏడాది పొడవునా 24 గంటలు 112 సేవలు అందుబాటులో

అత్యవసర సేవల్లో ఏఐ వినియోగాన్ని పెంచనున్నట్లు డీజీపీ వెల్లడి

2లో.




## విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన

ఇది బహుళ క్రీడా కేంద్రం, సీఎం చంద్రబాబు సూచనతోనే రూపకల్పన

సంస్థలే ఛాంపియన్లను నిర్మిస్తాయని, క్రీడలు వ్యక్తిత్వాన్ని పెంచుతాయని వ్యాఖ్య

ఏపీని క్రీడాకారులను తయారు చేసే గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యం

ప్రతి బిడ్డలో స్ఫూర్తి నింపిన సింధుకు లోకేశ్ అభినందనలు

2లో.



## రైతులు ఆత్మహత్యలు పట్టవా ?

### : కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శనాస్త్రాలు

దేవరపల్లిలో పొగాకు రైతులను కలిసిన వైఎస్ జగన్

**అమరావతి,ఆగస్టు 5 :**
వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన, పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విధ్వంసం సృష్టిస్తోందని **మిగతా 2లో...**



## హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ..




8 ప్రముఖ కాలేజీల అక్రమాల రట్టు!

నకిలీ ఎన్‌ఓసీ పత్రాలను తయారు చేసిన ముఠా గుట్టు రట్టు

పోలీసులకు ఫిర్యాదు చేసిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు

**హైదరాబాద్,ఆగస్టు 5 :**
హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న 'హైడ్రా' పేరును వాడుకుని కొందరు అక్రమాలకు యత్నించిన తీరు తీవ్ర కలకలం రేపుతోంది. స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ 'ఫైర్ ఎన్‌ఓసీ' (చీూజ) పత్రాలను తయారు చేసిన ఒక ముఠా గుట్టు రట్టయింది. ఏకంగా నగరంలోని 8 ప్రముఖ ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఈ నకిలీ సర్టిఫికెట్ల ఆధారంగా గుర్తింపు పొందేందుకు యత్నించడం విద్యాశాఖతో పాటు పోలీసు వర్గాలను **మిగతా 2లో...**

## 22ఏ భూముల పేరిట
# అన్యాయం జరగదు

కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు

ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని అదే స్ఫూర్తితో పనిచేయాలి

అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలి

జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టమైన ఆదేశాలు



**హైదరాబాద్,ఆగస్టు 5 :**
రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత **మిగతా 2లో...**

## రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు

జార్ఖండ్ నిరుద్యోగులకు సిజెపి మద్దతు

దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తాం

సిజెపి నేత అభిజిత్ దీప్కే స్పష్టీకరణ

**ముంబై, ఆగస్టు 5(పిసిడబ్ల్యూ న్యూస్):**
జార్ఖండ్ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతు **మిగతా 2లో...**



## అమెరికాలో భారతీయుల ఘనత..

'ఇండియా డే'గా ప్రకటిస్తూ మసాచుసెట్స్ గవర్నర్ ఉత్తర్వులు!

ప్రవాస భారతీయుల సేవలకు గుర్తింపుగా గవర్నర్ మౌరా హీలీ ప్రకటన

బోస్టన్ నగరంలోనూ 'ఇండియా డే'గా పాటిస్తూ మేయర్ ఉత్తర్వులు

భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు భారత సంఘాల సన్నాహాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 5 :**
అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులకు అరుదైన గౌరవం దక్కింది. మసాచుసెట్స్ రాష్ట్రంలో ప్రతి ఏటా ఆగస్టు 15వ తేదీని 'ఇండియా డే'గా అధికారికంగా జరపాలని ఆ రాష్ట్ర గవర్నర్ మౌరా హీలీ ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక, సాంస్కృతిక ప్రగతిలో భారతీయ సమాజం **మిగతా 2లో...**



# రైతులు ఆత్మహత్యలు పట్టవా ?

**మొదటిపేజీ తరువాయి**

ఆయన ఆరోపించారు.పొగాకు బ్యారన్లను పరిశీలించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. "మా ప్రభుత్వ హయాంలో కిలో పొగాకుకు సగటున రూ.289 ధర పలికింది. కొందరు రైతులు రూ.365 వరకు కూడా పొందారు. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం వచ్చాక ధర రూ.236కు పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు పెరుగుతుంటే, గిట్టుబాటు ధర తగ్గిపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు" అని జగన్ అన్నారు. ప్రభుత్వం కేవలం 21 శాతం పంటను మాత్రమే కొనుగోలు చేసిందని, మిగిలిన పంట విషయంలో వ్యాపారులు, సిండికేట్లతో కుమ్మక్కై రైతులను దగా చేస్తోందని విమర్శించారు.
గిట్టుబాటు ధర లేకపోవడంతో వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని జగన్ వెల్లడించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ వెళ్లకపోవడం దారుణమన్నారు. తమ హయాంలో అమలు చేసిన సున్నా వడ్డీ రుణాల పథకాన్ని, రైతు భరోసా కింద అదనంగా ఇచ్చే సహాయాన్ని రద్దు చేశారని, ఉచిత పంటల బీమాను కూడా ఎత్తివేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

# అమెరికాలో భారతీయుల ఘనత..

**మొదటిపేజీ తరువాయి**

పోషిస్తున్న కీలక పాత్రకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన జారీ చేశారు.1947లో బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొంది, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ ఆవిర్భవించిందని గవర్నర్ తన ప్రకటనలో కొనియాడారు. వైద్యం, టెక్నాలజీ, విద్య, వ్యాపారం వంటి రంగాల్లో ఇండియన్–అమెరికన్లు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. అమెరికాలో నివసిస్తున్న 50 లక్షల మంది సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న 3.6 కోట్ల మంది ప్రవాస భారతీయుల పాత్రను ఆమె గుర్తుచేశారు.మరోవైపు, బోస్టన్ నగర మేయర్ మిషెల్ వూ కూడా ఆగస్టు 15ను 'ఇండియా డే'గా ప్రకటిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.బోస్టన్‌లో కొత్తగా భారత కాన్సులేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడాన్ని ఆమె స్వాగతించారు.గవర్నర్, మేయర్ల నిర్ణయంపై 'ఇండియా అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ బోస్టన్' (ఐఏజీబీ) వంటి భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బోస్టన్ హార్బర్ వద్ద భారీ పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. అమెరికా గడ్డపై భారతీయ సమాజానికి లభించిన ఈ గౌరవం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు

**మొదటిపేజీ తరువాయి**

ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడిన దీప్కే, జూలై 29 నుంచి రాంచీలో జరుగుతున్న నిరవధిక ఆందోళనకు తమ సంఘీభావం ఉంటుందని చెప్పారు. తాము తప్పకుండా జార్ఖండ్ వెళ్తామని, అక్కడి విద్యార్థుల ప్రతీ డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ప్రస్తుతం సీజేపీ రాజకీయ పార్టీగా కాకుండా, ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తుందని దీప్కే వెల్లడించారు. న్యాయవ్యవస్థ, రాజకీయాలు, మీడియా, ఎన్నికల సంఘం వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వీటిలో జవాబుదారీతనం తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమని చెప్పారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు ఇతర నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణలో ఎమర్జెన్సీకి ఇక ఒకే నంబర్..

**హైదరాబాద్,ఆగస్టు 5**

తెలంగాణలో అత్యవసర సేవల కోసం ఇకపై ఒకే నంబర్ అందుబాటులో ఉంటుంది. ఇప్పటి వరకు పోలీసులకు 100, అంబులెన్స్, అగ్నిమాపక సేవలకు వేర్వేరు నంబర్లను ఉపయోగించగా, ఇక నుంచి వాటన్నింటికీ డయల్ 112 అమల్లోకి వచ్చింది. హైదరాబాద్‌లో కొత్త ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌ను డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు.కొత్త విధానంతో పోలీసు, అంబులెన్స్, అగ్నిమాపక సహా ఇతర అత్యవసర సేవలు ఒకే వేదికపైకి వస్తాయి. రోడ్డు ప్రమాదాలు, దోపిడీలు, గొడవలు, మహిళలపై వేధింపుల వంటి అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేస్తే వెంటనే స్పందన లభించేలా వ్యవస్థను రూపొందించినట్లు డీజీపీ తెలిపారు.ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కాల్స్‌ను పర్యవేక్షిస్తారు. 112కు ఫోన్ వచ్చిన వెంటనే కాలర్ వివరాలు, లొకేషన్‌ను గుర్తించి సమీప పోలీస్ స్టేషన్, అగ్నిమాపక సిబ్బంది, అవసరమైన బృందాలకు సమాచారం పంపిస్తారు. దీంతో సహాయక చర్యలు మరింత వేగంగా ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు.డయల్ 112 సేవలు రోజుకు 24 గంటలు, ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మరింత విస్తృతంగా వినియోగించి అత్యవసర సేవల సామర్థ్యాన్ని పెంచాలని తెలంగాణ పోలీస్ శాఖ లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీజీపీ వెల్లడించారు.

# హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ..

**మొదటిపేజీ తరువాయి**

తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.హైడ్రా కార్యాలయం నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే, కమిషనర్ పేరు మీద దొంగ సంతకాలతో ఫేక్ ఎన్‌ఓసీలు సృష్టించారు. ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అఫిలియేషన్ (అనుమతులు) సాధించడం కోసం సదరు ప్రైవేటు కాలేజీలు ఈ నకిలీ పత్రాలను సమర్పించాయి. అయితే బోర్డు అధికారులు, హైడ్రా యంత్రాంగం డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు ఆ సర్టిఫికెట్లు నకిలీవని, వారి సంతకాలు ఫోర్జరీకి గురయ్యాయని తేలింది. ఈ దారుణ అక్రమంపై స్పందించిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు.. మోసానికి పాల్పడిన 8 కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ లేక్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు.

**ఫోర్జరీకి పాల్పడిన జూనియర్ కాలేజీలు ఇవే:**

శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, చాంద్రాయణగుట్ట,రెసోనెన్స్ జూనియర్ కాలేజ్, ఎస్ఆర్ నగర్
హైందవి జూనియర్ కాలేజ్, బర్కత్‌పుర,ప్రియాం జూనియర్ కాలేజ్, మెహదీపట్నం
న్యూ ఎరా జూనియర్ కాలేజ్, చిక్కడపల్లి,మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజ్, విద్యానగర్
షాహీన్ జూనియర్ కాలేజ్, శివరాంపల్లి, వశిష్ట జూనియర్ కాలేజ్, తెల్లాపూర్.

# 22ఏ భూముల పేరిట అన్యాయం జరగదు

**మొదటిపేజీ తరువాయి**

ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. 22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలు, సూచనలు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ భూములు కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు.నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు.

# తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి..

**మొదటిపేజీ తరువాయి**

150 మీటర్లకు పెంచినా ముంపు 1000 హెక్టార్లలోపు ఉంటుందని తెలిపారు. తుమ్మిడిహెట్టి నిర్మాణంతో ఎత్తిపోతల ఖర్చు లేకుండా గ్రావిటీతో నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని వివరించారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. బుధవారం పలువురు కేంద్రమంత్రులను సీఎం కలవనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి షెడ్యూల్ బిజీబిజీగా ఉంది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో.. సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి గురించి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు, రహదారులకు శాఖాపరమైన అనుమతులపై కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చారు. పాలమూరు–రంగారెడ్డి, సీతమ్మ సాగర్, ఎస్ఆర్వీ ఆర్ డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు పాల్గొన్నారు. ఇకపోతే ప్రధాని మోదీని తిడితే భాజపా రాష్ట్రాల్లో ఒక్క కేసు అయినా పెట్టారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధానిని దూషిస్తే తమ ప్రభుత్వం కేసు నమోదు చేసిందని చెప్పారు. దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఒక డీఎస్పీని బదిలీ చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారని.. అధికారిని బదిలీ చేయడం ప్రభుత్వానికి ఉన్న అధికారమని పేర్కొన్నారు. తన పరిధిలో ఉంది కాబట్టే బదిలీ చేశానని చెప్పారు. భాజపా నేతలు కూడా అసభ్యంగా దూషిస్తున్నారని సీఎం విమర్శించారు. కాక్రోచ్ జనతా పార్టీని, విద్యార్థులను అంతకంటే ఎక్కువే దూషించారని పేర్కొన్నారు.

# విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన

**అమరావతి,ఆగస్టు 5 :**

ఒలింపిక్ పతకాలను అథ్లెట్లు గెలుస్తారని, కానీ ఆ ఒలింపిక్ కలలను సాకారం చేసేది అకాడమీలేనని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. పీవీ సింధు అకాడమీ అలాంటి ఛాంపియన్లను తయారుచేసే గొప్ప సంస్థగా ఎదుగుతుందని ఆయన ఆకాంక్షించారు. బుధవారం విశాఖపట్నంలో 'పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' శంకుస్థాపన కార్యక్రమంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ అకాడమీ కేవలం ఒక భవనం కాదని, భావి భారత ఛాంపియన్లకు పునాది అని ఆయన అభివర్ణించారు.ఈ అకాడమీ ఏర్పాటు వెనుక ఉన్న స్ఫూర్తిదాయక నేపథ్యాన్ని లోకేశ్ వివరించారు. "పీవీ సింధు తన హృదయానికి దగ్గరైన ఒక కలతో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఒక బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మించాలనే తన ఆశయాన్ని పంచుకున్నారు. కానీ, మన ముఖ్యమంత్రి ఎప్పుడూ ఉన్నదాని కంటే గొప్పగా ఆలోచించమని సవాల్ విసురుతారు. ఆయన సింధుతో 'కేవలం బ్యాడ్మింటనే ఎందుకు? అంతకు మించి ఆలోచించు. వివిధ క్రీడల్లో నైపుణ్యం ఉన్న పిల్లలందరికీ శిక్షణ ఇచ్చే ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్మించు' అని ప్రోత్సహించారు. ఈ రోజు మనం చూస్తున్న ఈ బృహత్ కార్యం ఆ దార్శనికతకు ప్రతిరూపం" అని లోకేశ్ తెలిపారు. ఇది కేవలం ఒక సౌకర్యం నిర్మించడం కాదని, ఒక వారసత్వాన్ని నిర్మించడం అని ఆయన అన్నారు.
ప్రభుత్వ విధానాలను వివరిస్తూ, చదువుతో పాటు క్రీడలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని లోకేశ్ స్పష్టం చేశారు. "తరగతి గది జ్ఞానాన్ని నిర్మిస్తే, క్రీడా మైదానం వ్యక్తిత్వాన్ని నిర్మిస్తుంది. అందుకే రాష్ట్రంలోని పాఠశాలల్లో శనివారాలను 'నో బ్యాగ్ డే'గా ప్రకటించాం. విద్యార్థులకు నచ్చిన క్రీడను ఎంచుకునే స్వేచ్ఛ ఇచ్చి, వారికి అవసరమైన క్రీడా పరికరాలను అందిస్తున్నాం" అని తెలిపారు. క్రీడలు క్రమశిక్షణ, గౌరవం, ఓటమిని ఎదుర్కొనే ధైర్యాన్ని నేర్పుతాయని, అందుకే ప్రతి బిడ్డ ఒక క్రీడ ఆడాలని ఆయన అభిప్రాయపడ్డారు.హైదరాబాద్‌లో సైబర్ సిటీ నిర్మిస్తున్నప్పుడు చాలా మంది సందేహాలు వ్యక్తం చేశారని, కంప్యూటర్లు కడుపు నింపుతాయా అని ప్రశ్నించారని లోకేశ్ గుర్తుచేశారు. "కానీ ఆ ఒక్క భవనం హైదరాబాద్‌లో ఐటీ విప్లవానికి నాంది పలికింది. అదేవిధంగా, ఈ అకాడమీ కూడా ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగంలో ఒక విప్లవాత్మక మార్పునకు ఉత్ప్రేరకంగా నిలుస్తుందని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ దత్తాత్రేయకు 18 నెలల గడువు విధిస్తూ, 2028 మే నాటికి రిబ్బన్ కటింగ్ ఉండాలని స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌ను కేవలం గొప్ప విద్యార్థులు, పరిశ్రమలకే కాకుండా, గొప్ప క్రీడాకారులను తయారుచేసే గమ్యస్థానంగా మార్చడమే తమ కల అని లోకేశ్ అన్నారు. "ఈ అకాడమీ గేట్ల నుంచి ఒకనాడు ఆశతో అడుగుపెట్టిన చిన్నారి, కొన్నేళ్ల తర్వాత ఒలింపిక్ స్టేడియంలో మన మువ్వన్నెల జెండాను మోస్తుంది. ఆ ప్రయాణం ఇక్కడే ప్రారంభమైందని మనమందరం గుర్తుంచుకుంటాం. 'సింధు చేయగలిగితే, నేను కూడా చేయగలను' అని ప్రతి బిడ్డ నమ్మాలి" అని పిలుపునిచ్చారు. విశాఖను ఎంచుకున్నందుకు సింధుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రభుత్వ పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

# మళ్లీ కీలక వడ్డీరేట్లను మార్చని ఆర్‌బీఐ

**రెపో రేటు 5.25 శాతంగానే కొనసాగించిన ఆర్‌బీఐ**

**ద్రవ్య విధానంలో తటస్థ వైఖరి**

**ఎస్‌డీఎఫ్ 5%, ఎంఎస్ఎఫ్, బ్యాంక్ రేటు 5.5%గా కొనసాగింపు**

**ప్రపంచ వాణిజ్య అనిశ్చితిపై ఆర్‌బీఐ ఆందోళన**

**దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందన్న ఆర్‌బీఐ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 5 :**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి కీలక వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం తర్వాత రెపో రేటును 5.25 శాతంగానే కొనసాగిస్తున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, పెరుగుతున్న వాణిజ్య అనిశ్చితి దృష్ట్యా తటస్థ వైఖరినే కొనసాగిస్తున్నట్టు వెల్లడించింది.
రెపో రేటులో మార్పు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న హోమ్ లోన్, వాహన రుణం, వ్యక్తిగత రుణాల ఈఎంఐలు వెంటనే పెరగవు. కొత్త రుణాలపై కూడా బ్యాంకులు ప్రస్తుత వడ్డీ రేట్లనే కొనసాగించే అవకాశం ఉంది.ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. అమెరికా కొత్త సుంకాలు విధించడం వల్ల ప్రపంచ వాణిజ్య పరిస్థితుల్లో అనిశ్చితి కొనసాగుతోందన్నారు. పశ్చిమాసియా సంక్షోభం ప్రభావంతో ముడి చమురు ధరలు, ఆర్థిక మార్కెట్లు ఇంకా ఒడుదొడుకులకు లోనవుతున్నాయని చెప్పారు.
స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) రేటును 5 శాతంగానే కొనసాగించారు. మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్) రేటు, బ్యాంక్ రేటును 5.5 శాతంగా యథాతథంగా ఉంచారు.
ద్రవ్యోల్బణం ఇటీవల కొంత పెరిగినా ఆర్‌బీఐ నిర్దేశించిన పరిమితుల్లోనే ఉందని గవర్నర్ తెలిపారు. ముడి చమురు ధరల పెరుగుదల, రూపాయి మారకపు విలువలో మార్పులు, పశ్చిమాసియా పరిణామాలు ఆర్‌బీఐ నిర్ణయాలపై ప్రభావం చూపుతున్న ప్రధాన అంశాలుగా పేర్కొన్నారు.
మరోవైపు దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని ఆర్‌బీఐ అభిప్రాయపడింది. వృద్ధి రేటులో ఊపు కొనసాగడం, సానుకూల వర్షపాతం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలుస్తున్నాయని వెల్లడించింది.
అయితే కొన్ని రంగాల్లో ప్రారంభ దశ ఒత్తిడి కనిపిస్తోందని సంజయ్ మల్హోత్రా అన్నారు. ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి అంచనాల చుట్టూ ఇంకా గణనీయమైన ప్రమాదాలు పొంచి ఉన్నాయని వ్యాఖ్యానించారు.
జూన్‌లో జరిగిన గత ఎంపీసీ సమావేశంలో కూడా రెపో రేటును 5.25 శాతంగానే కొనసాగించారు. అదే సమావేశంలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ వృద్ధి అంచనాను 6.9 శాతం నుంచి 6.6 శాతానికి ఆర్‌బీఐ తగ్గించింది. ప్రపంచ అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు, ఇంధన ధరల పెరుగుదల ఇందుకు కారణాలని అప్పట్లో పేర్కొంది.

# తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

**మొదటిపేజీ తరువాయి**

ఏపీకి ఎక్కడిదని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టాడు.కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయండి.. తెలంగాణ నోటికాడ ముక్క లాక్కొండని ప్రతిపాదించారు. దీన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నారు. ఈనెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని జిఆర్ఎంబి సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోసమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేంద్రప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన పట్టించుకోలేదా..? అసలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిది. ఇది ఎజెండాలో పెట్టే జీఆర్ఎంబీకి ఎక్కడిది..? అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ అంటే ఎట్లా కనబడుతుంది మీకు. త్యాగాల పునాదుల మీద, పోరాటాల మీద సాధించుకున్న ఈ తెలంగాణ నీళ్ల కోసం జరిగిన ఈ ఉద్యమంలో కేసీఆర్ కష్టపడి 383 టీఎంసీల గోదావరి జలాలను మేం అనుమతులు తెచ్చినమన్నారు. తెచ్చిన అనుమతులు రద్దయితయా..? అని హరీశ్ రావు అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 ఏండ్లలో ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతి తేలేదు.. ఒక్క టీఎంసీకి కూడా మీకు క్లియరెన్స్‌లు తేలేదు. మీరొచ్చిన తర్వాత డీపీఆర్‌లు రిటర్న్ వచ్చినయి. సమ్మక్క బ్యారేజ్, పాలమూరు ఎత్తిపోతల పథకం డీపీఆర్ రిటర్న్ వచ్చింది. వార్ధా డీపీఆర్ రిటర్న్ వచ్చింది ఒక్కో ప్రాజెక్టు వాపసు వస్తున్నాయి. పైగా బీఆర్ఎస్ తెచ్చిన అనుమతులు రద్దు చేయాలనే ఎజెండా వచ్చింది. ఎంత చేతకాని దద్దమ్మ ప్రభుత్వం ఇదని హరీశ్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 ఆగస్టు 25న ఎంతో కష్టపడి సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు సాధించిందని హరీశ్ రావు గుర్తుచేశారు. అయితే ఇప్పుడు ఆ సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఉరి వేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా 47 టీఎంసీల సమ్మక్క సాగర్ ప్రాజెక్టును వదులుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, తెలంగాణ ప్రభుత్వం దానికి అంగీకరించిందన్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నీళ్లు వాస్తవానికి ప్రస్తుత ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్ నగర్‌కు వెళ్తాయని, అయినా కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తాము ఈ అంశాన్ని లేవనెత్తిన రెండు రోజులకే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయడం వారి దివాలాకోరుతనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన ఏడు అనుమతులను రివ్యూ చేస్తామని కేంద్రం చెబుతున్నప్పటికీ బీజేపీ నేతలు ఏమాత్రం స్పందించకపోవడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి భయపడి కేంద్ర మంత్రులు పెదవులు మూసుకుంటున్నారని, దీనిపై బీజేపీ వెంటనే స్పందించకపోతే తెలంగాణ ప్రయోజనాల కోసం మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. తెలంగాణలో ప్రస్తుతం చంద్రబాబు బంటు ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టే జీఆర్ఎంబీ అజెండాలో ఇలాంటి ప్రతిపాదనలు వస్తున్నాయని, ఒకవేళ కేసీఆర్ సీఎంగా ఉంటే ఆంధ్రప్రదేశ్ లేదా కేంద్రానికి ఇంత ధైర్యం వచ్చేదా అని ప్రశ్నించారు. ఏపీ మూలాలు ఉన్న అధికారులు తెలంగాణ ఇరిగేషన్ శాఖలో బాధ్యతలు వహిస్తుండటం వల్లే ఇలా జరుగుతోందని ఆరోపించారు. జీఆర్ఎంబీ సమావేశ అజెండా నుంచి గోదావరి, బనకచర్ల అంశాలను తొలగించాలని, ఈ అజెండాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పార్లమెంట్‌లో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు గళం విప్పాలని కోరారు. ఇరిగేషన్ విషయంలో ప్రభుత్వం రిట్, సూట్ పిటిషన్ల పేరుతో ఏడాది కాలంగా సమయం వృథా చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి లోపాయికారీ ఒప్పందాలతో గోదావరి, బనకచర్ల ప్రాజెక్టులకు ఒప్పుకున్నారని ఆరోపించారు. గోదావరి జలాల్లో తెలంగాణకు చట్టబద్ధంగా 960 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ, రాష్ట్ర హక్కులు కాలరాస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తూ బొమ్మలాగా కూర్చున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేదని హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. తెలంగాణకు తాగు, సాగునీరు దూరం చేసే కుట్ర జరుగుతోందని హరీశ్ ఆరోపించారు. రాష్ట్రానికి ద్రోహం జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. గురు దక్షిణ చెల్లించడం కోసం రేవంత్ మౌనంగా ఉన్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో చేతగాని ప్రభుత్వం ఉందని విమర్శించారు. నీటి విషయంలో అన్యాయం జరిగితే తెలంగాణ ఊరుకోదని హెచ్చరించారు. కాళేశ్వరం అనుమతులు రద్దు చేయడమంటే సగం తెలంగాణకు అన్యాయం చేయడమే అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాలను కూడా సరిగా వాడటం లేదని మాజీ మంత్రి విమర్శించారు. గోదావరిపై ఉన్న నీళ్లను ఎత్తిపోయడం లేదన్నారు. తెచ్చిన అనుమతులు కూడా ఇప్పుడు రద్దయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. సమ్మక్క బ్యారేజీకి అనుమతి ఇవ్వొద్దని ఏపీ చెబితే ఉఖీఓఃలో పెట్టారని మండిపడ్డారు. బనకచర్ల, మల్లన్నసాగర్ కడతారు కానీ.. సమ్మక్క బ్యారేజీ ఎందుకు వద్దని హరీశ్ రావు ప్రశ్నించారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ నాయకుడు దాసరి రమేష్‌ను పరామర్శించిన ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు







**వెంకటాపూర్ (నల్లగుంట)ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 05 (పీపుల్స్ న్యూస్)** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నల్లకుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు దాసరి రమేష్ ఇటీవల ద్విచక్ర వాహన ప్రమాదానికి గురై కాలు ఫ్రాక్చర్ అయిన విషయం తెలుసుకున్న ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు రమేష్ ఆరోగ్య పరిస్థితిని, అందిస్తున్న వైద్య చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రమేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, పార్టీ తరఫున ఎల్లప్పుడూ పూర్తి సహకారం, అండదండలు ఉంటాయని ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పోరిక గోవింద నాయక్, మల్క రమేష్, లింగాల రమణారెడ్డి, గయ్ అశోక్, అబ్బ గోపాల్ రెడ్డి, తాటి కృష్ణ, భూక్య జంపన్న, కొమరం దనలక్ష్మి, ఎండి బలి బాబా, తుమ్మ మల్లారెడ్డి, జంగాలపల్లి సర్పంచ్, ముడతనపల్లి మోహన్, నర్ర భద్రయ్య, పోరిక అర్జు నాయక్, పోశాల వీరమల్లు, సంపత్ రెడ్డి, జనగాం రవి, ఎర్రబెల్లి గోపాలరావు, పిన్నింటి మధుసూదన్ రెడ్డి, గుండ్ల రమేష్, అజ్మీర సాదరులాల్, దుర్గం రమణయ్య, కోయిల మహేష్, భాష నాగ రమేష్, కర్ర రవీందర్, లకావత్ నరసింహా నాయక్, అజ్మీర సురేష్, మాలోత్ గాంధీ, తాడూరి రఘు, యలవర్తి శ్రీనివాసరావు, వావిలాల పోచయ్య, గుడిసేవ నాగేశ్వరరావు, గండేపల్లి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ ను కలిసిన టీబీజేపీ నాయకులు



**న్యూ ఢిల్లీ, హైదరాబాద్,:** ఢిల్లీలోని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారిక నివాసంలో మధ్యాహ్న విందులో రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమకాలీన రాజకీయ అంశాలు, రాష్ట్రంలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు మరియు భవిష్యత్ కార్యాచరణపై పరస్పరం చర్చించారు.

# ప్రభుత్వ సెలవు రోజుల్లోనే అనుమతులు అక్రమ బోర్ల హడావిడి..!

-- అధికారుల గైర్హాజరును అవకాశంగా మార్చుకున్న డ్రిల్లింగ్ మాఫియా?

-- సైబరాబాద్, మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో

--- నిబంధనలకు విరుద్ధంగా బోరు తవ్వకాలపై ఆరోపణలు!?



**బాలానగర్ ఆగస్టు 06 ( పీపుల్స్ న్యూస్)**
సైబరాబాద్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూసాపేట సర్కిల్, బోయినపల్లి సర్కిళ్ల పరిధిలో బాలానగర్, బోయినపల్లి డివిజన్లలో ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినాలను కొందరు అక్రమ బోరు డ్రిల్లింగ్ నిర్వాహకులు తమకు అనుకూలంగా మలుచు కుంటున్నారనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అధికారుల పర్యవేక్షణ తక్కువగా ఉండే రోజులను ఎంచుకుని అనుమతుల నిబంధనలను ఉల్లంఘిస్తూ బోర్లు తవ్వుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా
బాలానగర్, ఫతేనగర్, ఫిరోజ్‌గూడ, గౌతమ్‌నగర్‌తో పాటు పలు కాలనీల్లో ఆదివారం ప్రభుత్వ సెలవు కావడంతో బోరు డ్రిల్లింగ్ యంత్రాలు పెద్ద ఎత్తున పనిచేసినట్లు సమాచారం. సంబంధిత అధికారుల అనుమతులు లేకుండానే కొన్ని ప్రాంతాల్లో బోర్లు ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం, నిబంధనల ప్రకారం 4 అంగుళాల వ్యాసం కలిగిన బోరు తవ్వడానికి మాత్రమే అనుమతి తీసుకున్నప్పటికీ, వాస్తవంగా 6 అంగుళాల బోర్లు తవ్వుతున్నారని ఆరోపిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తున్నారని వారు పేర్కొం టున్నారు. ముఖ్యంగా అధికారుల కళ్ళుగప్పి యధేచ్చగా రాత్రి వేళల్లో బోర్లు వేసి ఇంతటితో ఆగకుండా, ఒక బోరుకు మాత్రమే అధికారిక అనుమతి తీసుకుని అదే స్థలంలో మరో అదనపు బోరును ఎలాంటి అనుమతి లేకుండానే తవ్వుతున్నట్లు కూడా సమాచారం వెలువడుతోంది. ఈ వ్యవహారం అధికారుల దృష్టికి వెళ్లినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**-- భూగర్భ జల సంపదకు ముప్పు........**
అనుమతులు లేకుండా విచ్చలవిడిగా బోర్లు తవ్వడం వల్ల భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పర్యావరణంపై అవగాహన ఉన్నవారు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గిపోతున్న నేపథ్యంలో ఇలాంటి అక్రమ బోరు తవ్వకాలు కొనసాగితే భవిష్యత్తులో తాగునీటి సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ఎవరి అండతో ఈ అక్రమాలు? సెలవు రోజుల్లోనే పెద్ద ఎత్తున బోరు తవ్వకాలు జరుగుతున్నాయంటే సంబంధిత శాఖల పర్యవేక్షణలో లోపాలున్నాయా? లేక కొందరు అధికారుల నిర్లక్ష్యమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతి పత్రాల్లో ఒకటి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పని మరొకటిగా ఉంటే దానిపై పర్యవేక్షణ ఎవరు నిర్వహిస్తున్నారనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.

**-- ప్రజా సంఘాలు, స్థానిక ప్రజలకు డిమాండ్లు......**
ఈ వ్యవహారంపై స్థానికులు పలు డిమాండ్లు చేస్తున్నారు.
సెలవు దినాల్లో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలి.
అనుమతి పొందిన ప్రతి బోరును క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలి.
4 అంగుళాల అనుమతితో 6 అంగుళాల బోర్లు తవ్వినట్లయితే కఠిన చర్యలు తీసుకోవాలి. ఒక అనుమతితో అదనపు బోర్లు తవ్వుతున్న వారిపై కేసులు నమోదు చేయాలి. అక్రమ బోరు డ్రిల్లింగ్ యంత్రాలను స్వాధీనం చేసుకుని భారీ జరిమానాలు విధించాలి.
భూగర్భ జలాల పరిరక్షణకు ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

**-- విచారణతోనే వెలుగులోకి పలు వాస్తవాలు**
ప్రస్తుతం వినిపిస్తున్నవి స్థానికులు చేస్తున్న ఆరోపణలు మాత్రమే. వీటిపై సంబంధిత శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది. అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. (గమనిక: ఈ కథనంలో పేర్కొన్న అంశాలు స్థానికులు చేసిన ఆరోపణలు మరియు అందిన సమాచారం ఆధారంగా రూపొందించబడ్డాయి. వీటి నిజానిజాలు సంబంధిత అధికారుల విచారణ అనంతరం నిర్ధారణ కావాల్సి ఉంది.)

# నర్సారెడ్డి భూపతిరెడ్డిని ఆహ్వానించిన దరువు అంజన్న



**కుత్బుల్లాపూర్,** తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ కలాల గళాల వేదిక ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న తెలంగాణ కళాకారుల బోనాల జాతర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సభ్యులు దరువు అంజన్న, కమిటీ సభ్యులు ఆహ్వానించారు.

# విగ్రహావిష్కరణ లో పాల్గొన్న రవికుమార్ యాదవ్



**హైదరాబాద్,** గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గం సాయి నగర్ కాలనీలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గౌడ సంఘం భవనం ప్రారంభోత్సవం, అలాగే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్ తో కలిసి పాల్గొన్నారు శేరిలింగంపల్లి బీజేపీ నాయకులు రవికుమార్ యాదవ్.

# బహిరంగ ప్రదేశాల్లో మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు


**- హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్**

**హైదరాబాద్ కమిషనరేట్,క్రైమ్ బ్యూరో ఆగస్టు 5 (పీపుల్స్ న్యూస్) :**
బహిరంగ ప్రదేశాల్లో మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, అన్నారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ పరిధిలోని 'షీ టీమ్స్' బోనాలు పండుగ–2026 సందర్భంగా హైదరాబాద్ నగరవ్యాప్తంగా పండుగ వేడుకలకు హాజరైన మహిళలు, పిల్లల భద్రత, రక్షణ గౌరవాన్ని కాపాడటానికి విస్తృత భద్రత నిఘా చర్యలు చేపట్టాయి.ఆలయాల ప్రాంగణాలు, ఊరేగింపు మార్గాలు, బస్ స్టాప్‌లు, మెట్రో స్టేషన్లు, మార్కెట్‌లు మరియు ఇతర రద్దీ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ప్రజలు గుమిగూడే అవకాశం ఉన్నందున, షీ టీమ్స్ సాధారణ దుస్తులలో (మఫ్టీ) నిఘా, వీడియో పరిశీలన , నిందితులపై తక్షణ చర్యల ద్వారా సమస్యాత్మక ప్రాంతాలలో నిఘాను ముమ్మరం చేశాయి. బోనాల పండుగ బందోబస్తు సమయంలో షీ టీమ్స్‌కు వివిధ విభాగాల కింద 122 ఫిర్యాదులు అందాయి. లి మహిళ పట్ల వేధింపులు, ఈవ్–టీజింగ్, ఫాలో కావడం (స్టాకింగ్), అనుచితంగా ప్రవర్తించడం వంటి అవాంఛనీయ చర్యలకు పాల్పడిన 678 మంది నిందితులను వీడియో ఆధారాలతో సహా ప్రత్యక్షంగా (రెడ్ హ్యాండెడ్‌గా) పట్టుకున్నారు. వీరిలో 25 మందికి న్యాయస్థానం ద్వారా జైలు శిక్ష , జరిమానా విధించారు. అదనంగా, షీ టీమ్స్ సమర్థవంతమైన దర్యాప్తు , సకాలంలో చట్టపరమైన చర్యల ద్వారా పరిశోధించిన 13 కేసులలో నిందితులకు శిక్షలు పడ్డాయి.పండుగ పొడవునా నిర్వహించిన ప్రత్యేక నిఘా చర్యలలో భాగంగా, రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాల్లో మహిళా భక్తులు , సందర్శకులతో అసభ్యంగా ప్రవర్తించడం, తాకడం, వెంటపడటం వంటి చర్యలకు పాల్పడిన నిందితులను వెంటనే అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై భారతీయ నశిత్ సంహిత హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ లోని సంబంధిత నిబంధనల ప్రకారం పెట్టీ కేసులు నమోదు చేశారు. న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, 11 మంది నిందితులకు గరిష్టంగా (3) రోజుల సాధారణ జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 1,050 చొప్పున జరిమానా విధించారు.మరో 26 మందికి ఒక్కొక్కరికి రూ. 1,050 జరిమానా విధిస్తూ, కమ్యూనిటీ సర్వీస్ (సామాజిక సేవ) చేయాలని ఆదేశించారు. ఇది మహిళలపై జరిగే నేరాల పట్ల 'జీరో టాలరెన్స్' (సహించేది లేదు) అనే స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది.శాంతిభద్రతల నిర్వహణతో పాటు, పండుగ వేడుకల్లో షీ టీమ్స్ విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. ఆలయాలు, ఊరేగింపు మార్గాలు, విద్యాసంస్థలు, ప్రజారవాణా కేంద్రాలు , వాణిజ్య ప్రాంతాలలో 400 అవగాహన కార్యక్రమాలు, 110 నిఘా/పరిశీలన చర్యలు చేపట్టారు. మహిళల భద్రత, సైబర్ సేఫ్టీ, చట్టపరమైన నిబంధనలు, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు, బాధ్యతాయుత ప్రవర్తన మరియు ఎటువంటి సంకోచం లేకుండా నేరాలపై ఫిర్యాదు చేయడంపై ఈ కార్యక్రమాలు దృష్టి సారించాయి.హైదరాబాద్ సిటీ పోలీస్ హెచ్చరిక హైదరాబాద్ సిటీ పోలీస్ పునరుద్ఘాటిస్తోంది. ఇటువంటి సంఘటనలు ఎదురైతే వెంటనే షీ టీమ్స్‌కు లేదా డయల్ 100/112 కు నివేదించాలని పౌరులకు విజ్ఞప్తి చేస్తోంది.మహిళలు, పిల్లలకు సురక్షితమైన వాతావరణాన్ని అందించడానికి షీ టీమ్స్ కట్టుబడి ఉన్నాయి. వేధింపులు, స్టాకింగ్, లైంగిక వేధింపులు, సైబర్ వేధింపులు లేదా సోషల్ మీడియా దుర్వినియోగానికి పాల్పడే వారిపై చట్టప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటాయి. వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి షీ టీమ్స్‌ను సంప్రదించాలన్నారు. మోసగాళ్లు మిమ్మల్ని నమ్మించి మోసం చేయడానికి నకిలీ ప్రొఫైల్స్ క్రియేట్ చేస్తుంటారు. ఆన్‌లైన్‌లో పరిచయమయ్యే వ్యక్తుల వివరాలను ఎల్లప్పుడూ సరిచూసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో మీ వ్యక్తిగత వివరాలను పరిమితంగా ఉంచాలన్నారు. మీ సోషల్ మీడియా, ఇతర డిజిటల్ ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు , టూ–ఫ్యాక్టర్ అథెంటికేషన్‌ను సక్రియం చేసుకోవాలన్నారు. బాధితులు మౌనంగా ఉన్నప్పుడే వేధింపులు పెరుగుతాయి. మీ మౌనం నేరస్థుడికి రక్షణ ఇస్తుంది. భయపడకుండా ముందుకు రండి, షీ టీమ్స్ మీ గోప్యతను కాపాడుతూ తక్షణ చట్టపరమైన చర్యలు తీసుకుంటాయి. అత్యవసర సహాయం లేదా ఫిర్యాదు కోసం సంప్రదించవలసిన నంబర్లు: డయల్ 100 / 112, వాట్సాప్ నంబర్: 9490616555 కు సంప్రదించాలన్నారు.

# యు ఎల్ సి స్థలాలపై కబ్జా రాయుళ్ల కళ్ళు..!

**- వివాదాలలో ఉన్న స్థలాలను సైతం వదలట్లే..!**
**- ఖాళీ కనిపిస్తే... ఖతమే..?**





**కుత్బుల్లాపూర్ : ఆగస్టు 5 (పీపుల్స్ న్యూస్)**
కాదేది కబ్జాకు అనర్హం అన్నట్టు... ఓ కబ్జారాయుడు కొండను పిండి చేసి కబ్జా చేస్తే... మరో కబ్జారాయుడు పోలీసులకు కేటాయించిన స్థలాన్ని మింగేసాడు.గాజులరామారం రెవెన్యూ పరిధిలో కబ్జా రాయుళ్ల కథలు వింటుంటే సీరియల్ లను తలపిస్తున్నాయి . దీనికి తోడు అక్రమ సంపాదనకు అలవాటు పడిన అధికారులైతే.. భాజాప్తగా అక్రమార్కులతో చేతులు కలిపి కోట్లు కొల్లగొడుతున్నట్లు ప్రజలు విమర్శిస్తున్నారు. దీనివలన భూ వితరాలకు ఉపయోగపడే కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయి. ఇక తాజాగా గాజులరామారం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 329/8 అనే స్థలం యు ఎల్ సి లో ఉంది. కానీ కొందరు ఖతర్నాక్ కబ్జారాయుళ్లు మాత్రం నకిలీ పత్రాలు సృష్టించి అందులోని సుమారు 800 గజాల స్థలాన్ని కబ్జా చేసి పట్టపగలే ఐదు అంతస్తుల అక్రమ భవనం నిర్మిస్తున్నారు.

**అండగా అధికార పార్టీ నేత..!**
కబ్జారాయుళ్లకు కాలం కలిసి వస్తుందో ఏమో కానీ... ఒకవైపు రెవెన్యూ అధికారులు, మరోవైపు రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో ఖాళీ జాగా కనిపిస్తే రాత్రికి రాత్రి అక్రమ నిర్మాణాలతో పాత నిర్మాణాలను తలపించే విధంగా.. రంగులు, స్తంభాలు, లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు, నిర్మించిన గదులలో నివసించేందుకు డబ్బులు ఇచ్చి కొందరిని ఉదయం నుండి సాయంత్రం వరకు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రజలు విమర్శిస్తున్నారు. దీనిని బట్టి చూస్తుంటే కబ్జా రాయుళ్లు ఎంతకు తెగిస్తున్నరో స్పష్టంగా కనిపిస్తుందని కొందరు ప్రజలు వాపోతున్నారు. నిత్యం ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రభుత్వ ఆస్తులను కాపాడవలసిన అధికారులు కబ్జారాయులకు సహకరించడం వలన కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి మాయమవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ వేతనాలు తీసుకుంటూ... ఒక్క నిమిషమైనా ప్రజల కోసం పనిచేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వ భూమి ఆక్రమణపై తహాశీల్దార్ నోటీసులు.**
గాజులరామారం పరిధిలో ప్రభుత్వ భూమిని అనధికారికంగా ఆక్రమించారని ఆరోపిస్తూ కుత్బుల్లాపూర్ మండల తహాశీల్దార్ కార్యా లయం నోటీసులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణల చట్టం–1905 లోని సెక్షన్–7 ప్రకారం ఈ నోటీసులు జారీ చేయ బడినట్లు అధికారిక పత్రాల్లో పేర్కొన్నారు.తహాశీల్దార్ కార్యాలయం నుంచి 29 జూలై 2026న విడుదలైన నోటీసు ప్రకారం, గాజు లరామారం సర్వే నంబర్ 329లో ఉన్న ప్రభుత్వ భూమిగా నమోదైన 283 చదరపు గజాల స్థలంలో నిర్మాణ భవనం ఏర్పాటు చేసినట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.ఈ భూమిని అనధికారికంగా ఆక్రమించుకున్నట్లు నివేదించబడిన నేపథ్యంలో, సంబంధిత వ్యక్తులు ఏడు రోజులలోపు తమ వివరణను వ్యక్తిగతంగా లేదా లిఖితపూర్వకంగా సమర్పించాలని నోటీసులో ఆదేశించారు. సరైన వివరణ ఇవ్వ లేకపోతే, భూ ఆక్రమణల చట్టంలోని సెక్షన్–5 ప్రకారం జరిమానా విధించడం, సెక్షన్–6 ప్రకారం ఆక్రమణ తొలగించడం, అలాగే స్థలంలో ఉన్న భవనం, నిర్మాణ సామగ్రి లేదా ఇతర ఆస్తులను జప్తు చేసే చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.ఈ వ్యవహారంలో సంబంధిత వ్యక్తుల వివరణ అనంతరం రెవెన్యూ శాఖ తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# విద్యార్థులు చిన్నతనం నుంచే రోడ్డు నిబంధనలను పాటించే అలవాటు చేసుకోవాలి

**- లంగర్ హౌస్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి. అంజయ్య**




**హైదరాబాద్ కమిషనరేట్,క్రైమ్ బ్యూరో ,ఆగస్టు 5 (పీపుల్స్ న్యూస్) :**
విద్యార్థులు చిన్నతనం నుంచే రోడ్డు నిబంధనలను పాటించే అలవాటు చేసుకోవాలని లంగర్ హౌస్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి. అంజయ్య అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ , విద్యార్థులలో రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన పెంచే లక్ష్యంతో తెలంగాణ ట్రాఫిక్ పోలీస్ డిపార్ట్‌మెంట్ నిర్వహిస్తున్న 'అరవై అలైవ్ ప్రోగ్రామ్‌లో భాగంగా జియాగూడలోని శ్లోక స్కూల్‌లో బుధవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. లంగర్ హౌస్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి. అంజయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 450 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా లంగర్ హౌస్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ విద్యార్థులకు రోడ్డు భద్రతా అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. రహదారి దాటే సమయంలో జీబ్రా క్రాసింగ్ ప్రాముఖ్యత మరియు సురక్షితమైన పద్ధతులు. 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు కూడా దీనికి బాధ్యులవుతారని హెచ్చరించారు. చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే తీవ్ర పరిణామాలు, ద్విచక్ర వాహనదారులు, వెనుక కూర్చునే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుండి ఎలా రక్షణ పొందోచ్చో వివరించారు. వాహనం నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించడం వల్ల దృష్టి మరలి ప్రమాదాలు ఎలా జరుగుతాయో తెలియజేశారు.ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా రాంగ్ రూట్‌లో ప్రయాణించడం ఎంత ప్రమాదకరమో వివరించారు. పాఠశాల ఆటోలలో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్లడం మరియు ఆటో డ్రైవర్ల నిర్లక్ష్యపు డ్రైవింగ్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తమ ఇళ్లలోని పెద్దలకు కూడా ఈ విషయాలపై అవగాహన కల్పించాలని ఇన్స్పెక్టర్ కోరారు. సురక్షితమైన ప్రయాణమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- సీఐ సుధీర్ కుమార్**






**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో,ఆగస్టు 5 (పీపుల్స్ న్యూస్) :**
విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ సుధీర్ కుమార్ సూచించారు.జాగృతి దివస్ సందర్భంగా బుధవారం ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో టీజీ మోడల్ కళాశాలలో "సురక్షా తిరంగా -- సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలు, వాటి నుంచి రక్షణ పొందే మార్గాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిస కాకూడదని, అపరిచితులు పంపే ఏపీకె ఫైళ్లు, అనుమానాస్పద లింకులు, క్యూఆర్ కోడ్‌లు క్లిక్ చేయకూడదని సూచించారు. ఇలాంటి చర్యల వల్ల మొబైల్ ఫోన్లు హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని వివరించారు.ఓటీపీ, యుపీఐ పిన్ బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు ఎవరికీ చెప్పకూడదని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దన్నారు. నకిలీ ఉద్యోగాలు, స్కాలర్‌షిప్‌లు, లాటరీలు, పెట్టుబడులు, గేమింగ్ రివార్డుల పేరుతో జరిగే సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్కు కాల్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ సుధీర్ కుమార్, ఎస్సై అక్షిత, ఎస్సై కిష్టా రెడ్డి పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు డిజిటల్ సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించి, అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలను సమర్థవంతంగా నివారించవచ్చని పోలీసులు తెలిపారు.

# సిఈఐఆర్ పోర్టల్ ద్వారా 30 సెల్‌ఫోన్‌లను రికవరీ

**- బాధితులకు అందజేసిన అఫ్జల్‌గంజ్ పోలీసులు**






**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో ఆగస్టు 5 (పీపుల్స్ న్యూస్) :**
పోగొట్టుకున్న, దొంగిలించబడిన 30 సెల్‌ఫోన్‌లను సిఈఐఆర్ పోర్టల్ , ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అఫ్జల్‌గంజ్ పోలీసులు విజయవంతంగా రికవరీ చేశారు. స్వాధీనం చేసుకున్న ఈ మొబైల్ ఫోన్‌లను సంబంధిత బాధితులకు (బాధ్యులకు) అప్పగించారు. ఈ సందర్భంగా విశేష ప్రతిభ కనబరిచిన అఫ్జల్‌గంజ్ ఎస్‌హెచ్‌ఓ ఎన్. మోహన్ రావు, డిఎస్ఐ వి. నరేందర్ రెడ్డి, క్రైమ్ హెచ్‌సీలు జి. మధుసూదన్, శ్రీకాంత్ బిడ్లా, పిసిలు జె. జితేందర్, జి. శ్రీకాంత్, డబ్ల్యూపీసీ ఎస్. ప్రియాంకల ప్రతిభను, కృషిని ఉన్నతా ధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ బృందానికి తగిన నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు.ఈ రికవరీ చర్యలు గోల్కొండ జోన్ డిసిపి జె. రాఘవేందర్ రెడ్డి, అడిషనల్ డిసిపి కృష్ణ గౌడ్, గోషామహల్ డివిజన్ ఎసిపి కె. చంద్రశేఖర్ రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో ,మార్గదర్శకత్వంలో చేపట్టారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి: కలెక్టర్ బోర్ఖడే హేమంత్



**ములుగు, ఆగస్టు 5 :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు.రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ములుగు నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న 303 పోలింగ్ కేంద్రాలకు అదనంగా 5 కొత్త కేంద్రాలు ఏర్పాటు చేసి మొత్తం 308 పోలింగ్ కేంద్రాలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. అలాగే రెండు పోలింగ్ కేంద్రాలను మార్చడం, నాలుగు కేంద్రాల పేర్లను సవరించడం జరుగుతుందని చెప్పారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని, రాజకీయ పార్టీల సహకారం అవసరమని కలెక్టర్

## సిఇఐఆర్ పోర్టల్ ద్వారా చోరీకి గురైన 25 మొబైల్ ఫోన్లను రికవరీ

### బాధితులకు అందజేసిన చిక్కడ్‌పల్లి పోలీసులు

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో ఆగస్టు 5 (పీపుల్స్ న్యూస్) :** హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చిక్కడ్‌పల్లి పోలీసులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన సిఇఐఆర్ పోర్టల్ , ఆధునిక సాంకేతిక దర్యాప్తు సహాయంతో చోరీకి గురైన 25 మొబైల్ ఫోన్లను విజయవంతంగా రికవరీ చేశారు. చిక్కడ్‌పల్లి ఏసీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను వాటి అసలు యజమానులకు భద్రంగా అందజేశారు. చిక్కడ్‌పల్లి డివిజన్ ఏసీపీ జి. రణవీర్ రెడ్డి, చిక్కడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ ఎల్. మధు బాబు దిశానిర్దేశంలో ఈ రికవరీ ప్రక్రియ పూర్తయింది. చిక్కడ్‌పల్లి సబ్-ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ కరీమ్, క్రైమ్ టీమ్ సిబ్బంది పీసీలు ఆంజనేయులు, డి. శివ, మహమ్మద్ ఇమ్రోజ్ సిఇఐఆర్ పోర్టల్ ద్వారా నిరంతరం సాంకేతిక విశ్లేషణ చేస్తూ, వివిధ ప్రాంతాల నుండి ఈ ఫోన్లను గుర్తించి రికవరీ చేశారు. ఈ సందర్భంగా చిక్కడ్‌పల్లి ఏసీపీ జి. రణవీర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిభ చూపిన క్రైమ్ బృందాన్ని అభినందించారు. ఎవరిదైనా మొబైల్ ఫోన్ పోయినా లేదా దొంగతనానికి గురైనా వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో









ఫిర్యాదు చేయాలని , సీఈఐఆర్ పోర్టల్ (ఆఆఆ.ఎవఅతీ.స్త్రశీఞ.ఱఅ) లో వివరాలు నమోదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పోయిన తక్షణమే వివరాలు నమోదు చేయడం వల్ల ఫోన్ పనిచేయకుండా బ్లాక్ చేయవచ్చని, దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు పోలీసులు త్వరగా గుర్తించి రికవరీ చేసేందుకు వీలు కలుగుతుందని తెలిపారు

## సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్
- అధికారులతో కలిసి 'సురక్ష కా తిరంగా' పోస్టర్ ఆవిష్కరణ









**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో ఆగస్టు 5 (పీపుల్స్ న్యూస్) :** సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ అన్నారు. 'సైబర్ జాగరూకత దివాస్' పురస్కరించుకుని సిటీ సైబర్ క్రైమ్ విభాగం ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో బుధవారం విశ్రాంత అధికారులు, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీ సజ్జనర్.. ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీలు రతన్, మాలకొండయ్య, విశ్రాంత ఈఎన్సీ కరీంలతో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించే 'సురక్ష కా తిరంగా' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సులో సీపీ సజ్జనర్ మాట్లాడుతూ సాంకేతికత పెరిగేకొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయని తెలిపారు. నగరంలో ఒక ఏడాది కాలంలో దొంగతనాలు, దోపిడీల వంటి సంప్రదాయ నేరాల వల్ల రూ.30 కోట్ల నష్టం వాటిల్లితే.. ఒక్క సైబర్ నేరాల రూపంలోనే బాధితులు ఏకంగా రూ.400 కోట్లకు పైగా కోల్పోతున్నారని తెలిపారు. అంటే సగటున రోజుకు రూ.కోటికి పైగా ప్రజల సొమ్ము కేటుగాళ్ల ఖాతాల్లోకి మళ్లుతోందన్నారు. విశ్రాంత ఉద్యోగుల డిజిటల్, భౌతిక భద్రతకు నగర పోలీసులు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. కష్టార్జితాన్ని సైబర్ నేరగాళ్ల చేతిలో పెట్టి మోసపోవద్దని, విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీనియర్ సిటిజన్లను డిజిటల్ అరెస్టులు, పింఛను సేవలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలకు గురిచేస్తున్నారని వివరించారు. సీబీఐ, ఈడీ, ఆర్‌బీఐ లేదా పోలీసు అధికారులమని చెప్పి డిజిటల్ అరెస్ట్ పేరిట బెదిరిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దన్నారు. మన చట్టాల్లో గానీ, పోలీసు వ్యవస్థలో గానీ 'డిజిటల్ అరెస్ట్' అనే విధానమే లేదని స్పష్టం చేశారు. అపరిచిత వ్యక్తుల నుంచి అలాంటి ఫోన్ కాల్స్ రాగానే భయపడకుండా వెంటనే కట్ చేయాలని సూచించారు. వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూప్‌ల ద్వారా వచ్చే ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రకటనలు, ట్రేడింగ్ లింక్‌లను చూసి మోసపోవద్దన్నారు. షేర్ ట్రేడింగ్ ను సెబీ ఆమోదించిన రిజిస్టర్డ్ బ్రోకర్లు, అధీకృత డీమ్యాట్ ఖాతాల ద్వారానే చేయాలని చెప్పారు. ఇంట్లోని పిల్లలు ఫోన్‌లు తీసుకుని ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లలో సభ్యత్వం తీసుకోవడం వల్ల కూడా పెద్దల రిటైర్‌మెంట్ సొమ్ము మాయమవుతుందంటూ కొన్ని ఘటనలను గుర్తుచేశారు. బ్యాంకింగ్ వివరాలు, పిన్ నంబర్లు, ఓటీపీలను కుటుంబ సభ్యులతో సహా ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. ఒకవేళ అజాగ్రత్త వల్ల సైబర్ మోసానికి గురైతే, తక్షణమే స్పందించి గోల్డెన్ అవర్ లో 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా ఎన్‌సీఆర్పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. వెంటనే సమాచారం ఇస్తే బాధితుల సొమ్మును ఫ్రీజ్ చేసి తిరిగి రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు.అనంతరం మాజీ డీజీపీ ఎమ్. రతన్ మాట్లాడుతూ సైబర్ మోసాల బారిన పడకుండా ఉండేందుకు తన ఖాతా నుంచి రూ. 5,000 కంటే ఎక్కువ మొత్తానికి చెక్కులు వచ్చినా, విత్‌డ్రాయల్స్ ఉన్నా తన ముందస్తు అనుమతి లేనిదే క్లియర్ చేయవద్దని బ్యాంకులకు స్వయంగా సూచించినట్లు తెలిపారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా ఓటీపీలను ఇతరులతో ఎట్టిపరిస్థితుల్లోనూ పంచుకోవద్దని ఆయన హెచ్చరించారు. సీనియర్ సిటిజన్లు తమ ఫోన్‌లను పిల్లల చేతికి ఇచ్చేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలు తెలియక ఏదైనా బటన్ లేదా సందేహాస్పద లింక్‌ను నొక్కడం వల్ల బ్యాంకు ఖాతాల్లోని సొమ్ము క్షణాల్లో ఖాళీ అయ్యే ప్రమాదం ఉందన్నారు. మాజీ డీజీపీ పూనం మాలకొండయ్య మాట్లాడుతూ సైబర్ నేరం జరిగిన తర్వాత బాధితులు ఎంత ఆవేదన పడినా, పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినా పోగొట్టుకున్న డబ్బును తిరిగి సాధించడం చాలా కష్టమని పేర్కొన్నారు. వందల కోట్ల రూపాయల నష్టంతో పోలిస్తే రికవరీ అయ్యే మొత్తం అత్యంత స్వల్పం కాబట్టి, ముందస్తు జాగ్రత్తలు పాటించడమే సైబర్ నేరాలకు ఏకైక పరిష్కారమని స్పష్టం చేశారు. అవగాహన లోపం వల్ల సీనియర్ ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, ఉన్నత విద్యావంతులు సైతం కేటుగాళ్ల బురిడీ మాటలకు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ డిజిటల్ లావాదేవీల కోసం ప్రధానమైన పొదుపు ఖాతాను వాడకుండా, తక్కువ మొత్తం ఉండేలా మరో ప్రత్యేక బ్యాంక్ ఖాతాను తెరిచి దాన్ని మాత్రమే ఉపయోగించాలని సలహా ఇచ్చారు.అదనపు సీపీ (క్రైమ్స్) ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పద్ధతితో ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారని, అపరిచిత ఫోన్ కాల్స్, మెసేజ్‌ల పట్ల పౌరులు ఎల్లప్పుడూ జాగరూకతతో ఉండాలన్నారు. నగరంలో సైబర్ నేరాల నియంత్రణకు, ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు క్రైమ్ విభాగం నిరంతరం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఒకవేళ సైబర్ మోసం జరిగితే బాధితులు స్వల్ప సమయంలోనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు లేదా ఎన్‌సీఆర్పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే త్వరితగతిన స్పందించేందుకు వీలవుతుందని చెప్పారు. మోసం జరిగిన వెంటనే సమాచారం అందిస్తే నేరస్థుల బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేసి, బాధితుల సొమ్మును రికవరీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని స్పష్టం చేశారు. ఈ అవగాహన సదస్సులో ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ చైర్మన్ రమణా నాయక్, గౌరవ కార్యదర్శి రమేష్ మత్రి, డీసీపీలు శిల్పవల్లి, రమణారెడ్డి, రాజేశ్, నగర సైబర్ క్రైమ్ విభాగ ఏసీపీ శివమారుతి, అధికారులతో పాటు పెద్ద సంఖ్యలో విశ్రాంత అధికారులు, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధి అజెండాతో ఢిల్లీలో కీలక భేటీలు

- సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రులను కలిసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య





**న్యూఢిల్లీ, ఆగస్టు 5** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశమయ్యారు. ఈ భేటీల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కూడా ముఖ్యమంత్రితో కలిసి పాల్గొన్నారు.
ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను కలిసి తెలంగాణకు సంబంధించిన పర్యావరణ అనుమతులు, అటవీ సంరక్షణ, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించారు. అనంతరం కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమై రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, వాటికి అవసరమైన నిధుల విడుదలపై వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సమావేశాల్లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, ఇతర ఎంపీలు, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.సమావేశంలో ముఖ్యమంత్రి తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తును 150 మీటర్లకు పెంచేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి సహకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన పర్యావరణ అనుమతులు, సాగునీటి ప్రాజెక్టులకు నిధుల మంజూరు, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ అభివృద్ధి అజెండాను ముందుకు తీసుకెళ్లే దిశగా సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన ఈ ఢిల్లీ పర్యటనలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పాల్గొని రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం: గాదగోని రవి





**హనుమకొండ, ఆగస్టు 5 :**
తెలంగాణలో ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి విమర్శించారు. ప్రగతి సింగారం గ్రామంలో జరిగిన ఎంసిపిఐ(యు) హనుమకొండ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.హనుమకొండ నగరంలో వర్షాకాలంలో నీటి నిల్వలు, ఇళ్ల స్థలాలు, మౌలిక వసతుల సమస్యలు పరిష్కారం కాకపోవడం ప్రభుత్వాల వైఫల్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంసిపిఐ(యు) భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను కూడా ఆయన తీవ్రంగా విమర్శించారు.సమావేశంలో పార్టీ నాయకులు వల్లేపు ఉపేందర్ రెడ్డి, ఎన్. రెడ్డి హంసారెడ్డి, గడ్డం నాగార్జున, ఎం.డి. ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఎగువ మానేరు పరిసర ప్రాంతాల రైతులు ప్రజలకుసమాచారం అందియ్యాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఎగువ మా ప్రాజెక్టును పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితె

**రాజన్న సిరిసిల్ల జిల్లా/గంభీరావుపేట/ఆగస్టు05**
ఎగువ మానేరు ప్రాజెక్ట్ వద్ద నీటి పారుదల,రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఉన్న ఎగువ మానేరు ప్రాజెక్ట్ ను బుధవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి గితె,నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు.ప్రాజెక్ట్ పూర్తిస్థాయి



నీటిమట్టం,ఎగువ నుంచి వరద తదితర అంశాలపై జిల్లా నీటి పారుదల శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు.ఎగువ మానేరు ప్రాజెక్ట్ లోకి ప్రస్తుతం కూడవెల్లి,పాల్వంచ వాగుల నుంచి ఇన్ ఫ్లో లేదని,ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 2 టీఎంసీలు కాగా,ప్రస్తుత నీటి మట్టం1.6 టీఎంసీల నీరు ఉందని నీటి పారుదల శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.ఎగువ మానేరు ప్రాజెక్ట్ లోకి వరద చేరి పూర్తి స్థాయి నీరు నిండే అవకాశం ఉందని,నీటి పారుదల శాఖ,రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నియంత్రించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.పరిశీలనలో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు,జిల్లా నీటి పారుదల శాఖ అధికారి దయాకర్,ప్రశాంత్,తహసీల్దార్ మారుతి,సర్పంచ్.అర్చన తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘించినవారిపై కేసుల నమోదు



















**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో ఆగస్టు 5 (పీపుల్స్ న్యూస్) :** నిబంధనలు ఉల్లంఘించి ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేశారు. హైదరాబాద్ నగర ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ డి. జోయల్ డేవిస్ ఉత్తర్వుల మేరకు, అమీర్‌పేట ప్రధాన రహదారి ప్రాంతంలో రోప్ ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. హైదరాబాద్ ట్రాఫిక్-1 అదనపు డీసీపీ ఎ. రాములు, ఖైరతాబాద్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎస్. మోహన్ కుమార్ లు ఈ తనిఖీలను ప్రత్యక్షంగా పర్యవేక్షించగా, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ , సిబ్బంది ఈ ఆపరేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా కాజ్‌వేలు, కాలినడక బాటలు (ఫుట్‌పాత్‌లు) ఆక్రమించి పెట్టిన అక్రమ దుకాణాలు, అడ్డంకులను పూర్తిగా తొలగించి, ఆటంకం కలిగిస్తున్న వాహనాలను విడిపించారు. దీనివల్ల బాటసారుల నడకకు బాట సుగమం కావడమే కాకుండా, వాహనాల రాకపోకలు వేగవంతమయ్యాయి. నగరంలోని రహదారులన్నింటినీ సురక్షితంగా, ఆక్రమణలు లేకుండా ఉంచి, ప్రయాణికులు , కాలినడక బాటసారులందరికీ అనువుగా మార్చడానికి హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ నిరంతరం కట్టుబడి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

## నిరుపేదకు సీఎం సహాయనిధి రూ. 3.50 లక్షల ఎల్‌ఓసీ అందజేత

**కుత్బుల్లాపూర్ : ఆగస్టు 5 (పీపుల్స్ న్యూస్)** నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు నిరంతరం కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొండకల్ల




శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీ పత్రాలను గురువారం చింతల్‌లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా 293 సూరారం డివిజన్‌లోని విశ్వకర్మ కాలనీకి చెందిన అశోక్ కుమార్ పండిత్ కిడ్నీ మార్పిడి చికిత్స కోసం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 3.50 లక్షల విలువైన ఎల్‌ఓసీ మంజూరు చేయించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేద ప్రజలకు అత్యవసర వైద్య చికిత్స అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని నిరుపేదలకు ఈ నిధి ద్వారా పెద్ద ఎత్తున సహాయం అందుతోందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయడం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రత్యేకత అని కొనియాడారు. ఎల్‌ఓసీ అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి మరియు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, యశ్వంత్ రెడ్డి, సూరారం డివిజన్‌కు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మయన్మార్‌తో సరిహద్దు వివాదం.. పరిష్కారం దిశగా చర్చలు

**మణిపూర్:** మణిపూర్‌లో దశాబ్దాలుగా పెండింగ్‌లో సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకోవడానికి.. భారత్, మయన్మార్ ఓ భూభాగ మార్పిడి ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు సమాచారం. సరిహద్దులో దశాబ్దాలుగా పరిష్కారం కాని ప్రాంతాల గుర్తింపు ప్రక్రియలో భాగంగా ఇరు దేశాల మధ్య



భూభాగ మార్పిడి ప్రతిపాదనపై చర్చలు కొనసాగుతున్నాయని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. అయితే.. దీనిపై తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఢిల్లీలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. 'సరిహద్దులో ఇంకా పరిష్కరించని ప్రాంతాలు కొన్ని ఉన్నాయి. వాటి పరిష్కరించే దిశగా చర్చలు కొనసాగుతున్నాయి' అని అన్నారు. ఇటీవల వెలువడిన కథనాల ప్రకారం, మణిపూర్‌లోని చందేల్ జిల్లా, మయన్మార్‌లోని కబావ్ లోయ ప్రాంతం మధ్య సుమారు 1.4 చదరపు మైళ్ల భూభాగ మార్పిడి ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఈ మార్పిడి ద్వారా సరిహద్దు స్తంభాల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసి, మిగిలిన సరిహద్దును కంచెతో భద్రపరచాలని యోచిస్తున్నట్టు ఉన్నట్లు సమాచారం.

## విద్యార్థుల నిరసనలో పోలీసు చర్యపై అమిత్ షా సమాధానం చెప్పాలి

**న్యూ ఢిల్లీ :**విద్యార్థుల నిరసనపై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాయి. జులై 20న జరిగిన విద్యార్థుల ఆందోళనలో లాఠీచార్జ్, పెల్లెట్ గన్స్ వినియోగం జరిగిందన్న ఆరో పణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన చేపట్టారు. ఢిల్లీలోని ప్రేరణా స్థల్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం నుంచి మకర్ ద్వార్ వరకు మార్చ్ నిర్వహించారు. విద్యార్థులపై పోలీసుల చర్యతో పాటు అయోధ్య రామ మందిర విరాళాల నిధుల వ్యవహారం వంటి అంశాలపై కూడా ప్రశ్నించాయి. ప్రియాంక గాంధీ ప్రశ్నలుకాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజాస్వామ్య దేశంలో అధికారంలో ఉన్నవారు తమ నిర్ణయాలను బాధ్యత వహించాలని అన్నారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశమని, ఎవరి రాజదర్బార్ కాదని అన్నారు. యువతపై బలప్రయోగానికి ఆదేశాలు ఎవరు ఇచ్చారు? లాఠీచార్జ్, పెల్లెట్




గన్స్, టియర్ గ్యాస్ వినియోగానికి అనుమతి ఇచ్చింది ఎవరు?' అని ఆమె ప్రశ్నించారు. పదవుల్లో ఉన్న వారికి ప్రజల పట్ల బాధ్యత ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులపై కాల్పులు, పెల్లెట్ గన్స్ ప్రయోగం, టియర్ గ్యాస్, లాఠీచార్జ్ వంటి ఘటనలు జరిగితే అందుకు ఆదేశాలు ఇచ్చిన వారు బాధ్యత తీసుకోవాల్సిందేనని అన్నారు. వారు ప్రజల ముందు సమాధానం చెప్పాల్సిందేనని ఆమె పేర్కొన్నారు. పార్లమెంట్‌లోనూ నిరసనలవిపక్షాల నిరసనలతో పార్లమెంట్? ఉభయ సభల్లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్ సహా అయోధ్యలో విరాళాల చోరీ అంశంపై చర్చించాలని విపక్షాలు పట్టుపట్టగా లోక్ సభ ప్రారంభమైన కాసేపటికే వాయిదా పడింది. ఈ రెండు అంశాలపై కేంద్రహోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. కొందరు ప్రతిపక్ష ఎంపీలు నిల్చొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని స్పీకర్ కోరగా ప్రతిపక్షాలు వినకపోవడంతో సభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. అటు రాజ్యసభలోనూ ప్రతిపక్ష ఎంపీలు నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలో తొలుత మధ్యాహ్నం 12 గంటలకు సభ వాయిదా పడింది. సభ ప్రారంభం కాగానే మళ్లీ అదే పరిస్థితి నెలకొనడంతో రాజ్యసభ ఛైర్మన్ సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి తమ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రధాని, హోంమంత్రి సభకు వచ్చి ప్రకటన చేయాలని అన్నారు. చర్చ ద్వారానే పరిష్కారం లభిస్తుందని, అందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సభ ప్రారంభమై చాలా రోజులు గడిచినా ప్రధాని సభకు రాకపోవడం పార్లమెంట్‌ను అవమానించడమే నని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ మాట్లాడుతూ, దేశానికి సంబంధించిన కీలక అంశాలపై ప్రధాని సభలో సమాధానం ఇవ్వాలని విపక్షాలు కోరుతున్నాయని అన్నారు. ప్రధాని, హోంమంత్రి ఇద్దరూ సభకు హాజరుకాకపోవడం విచారకరమని, జాతీయ ప్రాధాన్య అంశాలపై వారి బాధ్యత కనిపించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఎంపీ సయ్యద్ నసీర్ హుస్సేన్ మాట్లాడుతూ, జంతర్‌మంతర్‌లో విద్యార్థుల నిరసన సందర్భంగా బలప్రయోగం, పెల్లెట్ గన్స్ వినియోగంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అయోధ్య రామ మందిరానికి వచ్చిన విరాళాల నిధులపై వస్తున్న ఆరోపణలు, జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ అంశాలపైనా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు.

## షేక్ హసీనా ప్రసంగంతో భారత ప్రభుత్వానికి సంబంధం లేదు

**బంగ్లాదేశ్ :** మాజీ ప్రధాని షేక్ హసీనా వర్చువల్‌గా పాల్గొననున్న కార్యక్రమంపై భారత ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది (). ఆ కార్యక్రమం నిర్వహణలో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి పాత్రా లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూూ) స్పష్టం చేసింది. బుధవారం సాయంత్రం ఢిల్లీ నుంచి హసీనా వర్చువల్‌గా ప్రసంగించనున్నారు. భారత భూభాగం నుంచి షేక్ హసీనా బంగ్లా అంతర్గత రాజకీయాల గురించి మాట్లాడడంపై వివాదం నెలకొంది. హసీనా



భారతదేశంలో రాజకీయ ప్రసంగం ఇవ్వడం వల్ల ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం పడొచ్చని బంగ్లాదేశ్ ఆందోళన వ్యక్తం చేసింది. పొరుగు దేశం భారత్‌తో ఉన్న స్నేహపూర్వక సంబంధాలు చెడిపోవాలని తాము కోరుకోవడం లేదని బంగ్లా విదేశాంగశాఖ సహాయ మంత్రి షామా ఒబేద్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని భారత్ అర్థం చేసుకుంటుందని ఆశిస్తున్నట్టు తెలిపారు బంగ్లా ఆరోపణలపై భారత్ విదేశాంగ శాఖ స్పందించింది. ఈ కార్యక్రమాన్ని పూర్తిగా ఒక ప్రైవేట్ మీడియా సంస్థ నిర్వహిస్తోందని తెలిపింది. షేక్ హసీనా ప్రసంగానికి, భారత ప్రభుత్వానికి ఎలాంటి సంబంధమూ లేదని, ఆ వేదికపై వ్యక్తమయ్యే అభిప్రాయాలు ప్రభుత్వ అధికారిక వైఖరిని ప్రతిబింబించవని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు.

## ఇథనాల్ పెట్రోల్‌పై దుష్ప్రచారం.. బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు


**బాంబే:** ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ అంశానికి సంబంధించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న కంటెంట్‌పై బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ఎక్స్, మెటాలలో ఉన్న అభ్యంతరకర




కంటెంట్‌ను వెంటనే తొలగించాలని ఆదేశించింది. ఇందులో ఏఐ ఆధారంగా క్రియేట్ చేసిన కంటెంట్ కూడా ఉందని పేర్కొంది. సంబంధిత కంటెంట్‌ను ఎవరు సృష్టించారు? ఎవరు అప్‌లోడ్ చేశారు? అనే వివరాలను తమకు అందజేయాలని ఎక్స్, మెటా సంస్థలను బాంబే హైకోర్టు ఆదేశించింది. సోషల్ మీడియా వేదికలపై తప్పుడు సమాచారం, మార్ఫింగ్ చేసిన వీడియోలు, ఏఐ ఆధారిత కంటెంట్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సాంకేతికత అభివృద్ధి సహా ఏఐ బేస్డ్ కంటెంట్ వినియోగం రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో.. వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకుండా చర్యలు చేపట్టాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

## క్షమాపణ చెప్పకపోతే 'సేఫ్ హార్బర్' రక్షణను ఉపసంహరిస్తాం

**న్యూ ఢిల్లీ :**జులై 23నాటి ప్రధాని మోదీ వీడియోను ఫేస్ బుక్ నుంచి తాత్కాలికంగా తొలగించడం ప్రకం పనలు సృష్టిస్తోంది. సమాచార, ప్రసార సాంకే తిక పార్లమెంటరీ స్థాయీసంఘం 'మెటా'పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో మెటా సీఈఓ జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పాలని, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని 3రోజు ల అల్టిమేటం జారీచేసింది. లేకుంటే భారత్‌లో పొందుతున్న 'సేఫ్ హార్బర్' రక్షణను రద్దుచేస్తామని హెచ్చరించింది. మెటా, ట్విట్టర్, స్నాప్‌చాట్, గూగుల్, యూట్యూబ్ వంటి ప్రధాన డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల నియంత్రణపై పార్లమెంటరీ స్థాయీ కమిటీ కీలక వ్యాఖ్యలు చేసింది. చిన్నారులపై లైంగిక వేధింపులు, మహిళలను కించపరిచడం వంటి కంటెంట్?పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేసింది. 'మోదీ




వీడియోను తొలగించడం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి బుధవారం సమావేశమైన పార్లమెంటు స్థాయీ సంఘం, ప్రధాని మోదీ పోస్ట్ చేసిన వీడియోను తొలగించడం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా పేర్కొంది. 140కోట్ల మంది భారతీయుల గొంతుకైన ప్రధాని వీడియోను బ్లాక్ చేయడం సాధారణ అంశం కాదని స్పష్టం చేసింది. కేవలం మెటా మాత్రమే కాకు ండా గూగుల్, యూ ట్యూబ్, ఎక్స్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ తదితర సామాజికమాధ్య మాలన్నీ భారత లు సాగించాలని సంఘం స్పష్టం చేసింది. ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ కార్య దర్శికి రాసిన లేఖలో, పేపర్ లీక్‌లపై కఠిన చర్యల గురించి ప్రస్తావించినట్లు లోక్‌సభ సచివాలయ డైరెక్టర్ ఒకరు మాట్లాడారు. విద్యార్థులు, జెన్ జీ తరాన్ని ఉద్దేశించి ప్రధాని ప్రసంగించిన వీడియోను ఫేస్‌బుక్ నుంచి ఐదు-ఆరు గంటల పాటు తొలగించడాన్ని చాలా తీవ్రంగా పరిగణించినట్లు పేర్కొన్నారు. గూగుల్ ప్లేస్టోర్?లోని కొన్ని మోసపూరిత ఫ్రాడ్ యాప్స్?పై కఠిన చర్యలు తీసుకోవాలని పార్లమెంటు స్థాయీ సంఘం లేఖలో పేర్కొంది. కాగా, ఫ్రాడ్ యాప్ కేసులో పెట్టుబడిదారులు రూ. 48 లక్షలకు పైగా నష్టపోయినట్లు హైదరాబాద్ సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు దాఖలయ్యాయి. సైబర్ మోసగాళ్లతో పాటు హైదరాబాద్ పోలీసులు గూగుల్ ఇండియా హెడ్‌ను కూడా ఈ కేసులో సహ నిందితుడిగా చేర్చి తదుపరి చర్యలకు సిద్ధం అయ్యారు. అయితే, హైదరాబాద్ పోలీసులు తీసుకున్న చర్య తరహాలోనే, భారత ప్రభుత్వం కూడా గూగుల్ ఇండియాపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా పార్లమెంటరీ కమిటీ తన లేఖలో పేర్కొంది.

# సంపాదకీయం




## ఉదయనిధి బరితెగింపు విమర్శలు !

అధికారంలో ఉంటే పెసరం మాటలు..రెచ్చగొట్టే ప్రసంగాలు..సనాతన ధర్మంపై అవాకులు చెవాకులు పేలడం వంటివన్నీ చూశాం. డిఎంకె నేత ఉదయనిధి స్టాలిన్ నేపథ్యం ఇది. ఏదిపడితే అది మాట్లాడిన తీరుపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. డిప్యూటి సిఎంగా అధికారం వెలగబెడుతూనే సనాతన ధర్మంపై నోరు పారేసుకున్నాడు. ఇలాంటి వారికి నటుడు ప్రకాశ్ రాజ్ లాంటి వారు చెంచాలుగా ఉన్నారు. తాజాగా ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు తమిళనాట రచ్చరేపాయి. త్రిషా కృష్ణన్‌పై చేసిన వ్యాఖ్యలకు అరెస్టయి, కోర్టు తీర్పుతో బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయినా తన పెడసరం మాటలాను తగ్గించుకుంటా నని అనడం లేదు. డిప్యూటి సిఎంగా పనిచేసిన వ్యక్తి కొంత సంయమనంగా ఉండాలి. అంత మాత్రాన నోటికి ఎంత వస్తే అంత మాట్లాడేస్తానంటే కుదరదు. తాత కరుణానిధి, తండ్రి స్టాలిన్ సంపాదించిన పొలిటికల్ క్రెడిబిలిటీని వివాదాస్పద వ్యాఖ్యలతో మంటకలిపేయడం లక్ష్యంగా ఉదయనిధి రాజకీయాలు సాగుతున్నాయి. తమిళనాడు రాజకీయ చరిత్రలో నాయకుల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు సర్వసాధారణం. అయితే రాజకీయ విమర్శల పేరుతో వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లడం ఆందోళన కలిగించే విషయం. ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన ఇమేజ్‌ను దిగజార్చే అవకాశాలున్నాయి. శశికళ నుంచి నేటి త్రిష కామెంట్స్ వరకు ఆయన వ్యవహార శైలి రాజకీయాల్లో నైతికతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నిరసనల్లో పొలిటికల్ పాయింట్లు మాట్లాడకుండా వ్యక్తిగత దాడులకు దిగడం సరైన పద్ధతి కాదన్నది అందరూ ముక్త కంఠంతో విమర్శించారు. ఈ తరహా వివాదాస్పద వ్యాఖ్యలు రాబోయే రోజుల్లో డీఎంకే పార్టీకి ఎలాంటి రాజకీయ మూల్యాన్ని చెల్లించేలా చేస్తాయో వేచి చూడాలి. అయితే రాజకీయాల్లో విమర్శలు సహజమే.. కానీ వ్యక్తిగత స్థాయికి దిగజారి మహిళలపై నోరు పారేసుకోవడం ఉదయ్ నిధి స్టాలిన్ వంటి నేతలకు మాత్రమే సాధ్యమని రుజువు చేసుకున్నారు. నటి త్రిషపై ఆయన చేసిన వ్యాఖ్యలతో తమిళనాడు ఒక్కసారిగా భగ్గుమంది.. అయితే ఇలాంటి మాటలు మాట్లాడటం ఆయనకు కొత్తేమీ కాదు. సనాతన ధర్మంపై ఆ మధ్య నోరు పారేసుకున్న ఉదయనిధి స్టాలిన్, గతంలోనూ నోటికి ఎంతొస్తే అంత మాట్లాడేవారు. తంజావూరులో కావేరి నీటి పంపకాల అంశంపై నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడిన సందర్భంగా ప్రభుత్వ తీరును, ముఖ్యమంత్రి విజయ్‌ను తీవ్రంగా విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం మానేసి డీఎంకేపై రాజకీయ కక్షసాధింపులకు విజయ్ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఉదయనిధి ప్రసంగిస్తున్న సమయంలో డీఎంకే కార్యకర్తలు నటి త్రిష పేరును నినాదాలుగా చేయడం ప్రారంభించారు. దానికి స్పందించిన ఉదయనిధి మన ప్రాంతానికి నీళ్లు రాకపోయినా పర్లేదు అక్కడ నీళ్లు చేరాలనేది ఆయన ఆలోచన అని డబుల్ మీనింగ్ వచ్చేలా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సహా పలువురు రాజకీయ నాయకులు దీనిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి నీచమైన మాటలతో మహిళలను కించపరిచా రని విమర్శిస్తున్నారు. ఉదయనిధి స్టాలిన్ మహిళలను ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకోవడం ఇదే మొదటిసారి కాదు. ఆయన ఎమ్మెల్యే కాకముందు నుంచి కూడా వరుస వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 2021 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అప్పటి ముఖ్యమంత్రి పళనిస్వామిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శశికళ కాళ్లను పట్టుకోవడానికి పళనిస్వామి శవంలా పాకారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రసంగం వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అన్నాడిఎంకె నాయకులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆయనపై డిఫమేషన్ కేసు కూడా నమోదు చేశారు. మహిళా నాయకులను, రాజకీయ ప్రత్యర్థులను దిగజార్చేలా మాట్లాడటం ఆయన శైలిగా మారిందనే విమర్శలు వచ్చాయి. విజయ్ నేతృత్వంలోని టీవీకే అధికారంలోకి వచ్చిన తర్వాత ఉదయనిధి తన వ్యాఖ్యల జోరు తగ్గించలేదు. దీనికితోడు అధికారం కోల్పోవడంతో తట్టుకోలేక పోతున్నాడు. మీడియా సమావేశంలో,తన ఎక్స్ ఖాతా పోస్ట్ ద్వారా ముఖ్యమంత్రి విజయ్‌ను సూటిగా లక్ష్యంగా చేసుకున్నారు. అసెంబ్లీ గౌరవానికి భంగం కలిగించేలా కుట్టి స్టోరీ చెప్పడం తగదని వ్యాఖ్యానించారు. చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం వెతుకుతున్న భార్య కథ తమిళనాడు అంతటికీ తెలుసంటూ వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారు. విజయ్, ఆయన భార్య సంగీత మధ్య ఉన్న వివాదాలను ఈ రకంగా ప్రస్తావించడంపై టీవీకే శ్రేణులు భగ్గుమన్నాయి. మరో సందర్భంలో మాట్లాడిన ఉదయ్ నిధి త్వరలోనే టీవీకే ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో ఐటమ్ పాటలకు డాన్సులు చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలు శాసనసభ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. డిఎంకె అధినేత స్టాలిన్ తన కుమారుడిని కంట్రోల్ చేసుకోవాల్సిందే. లేకుంటే ఈ విపరీతాలు ఎంతకైనా దారితీస్తాయి. విమర్శలకు అలవాటు పడ్డ ఉదయనిధి ఇకముందు వివాదాలు సృష్టించేలా మాట్లాడకుండా ఉండలేదు. అందువల్ల డిఎంకె

# హర్మ్యూజ్ తెరవకుంటే అంతే సంగతులు

**• మరోమారు ఇరాన్‌కు ట్రంప్ ఘాటు హెచ్చరిక**



**వాషింగ్టన్,ఆగస్ట్5:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్మ్యూజ్ జలసంధిని సాధ్యమైనంత త్వరగా తెరవాలని, లేదంటే తీవ్రమైన దాడులు ఎదుర్కోవాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌తో తమ చర్చలు సానుకూలంగా సాగుతున్నా.. వాటిని ఆ దేశం బహిరంగంగా ఖండించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఈసారి చర్చల నుంచి వెనక్కి తగ్గితే పరిణామాలు అత్యంత తీవ్రంగా ఉంటాయని టెహ్రాన్‌ను హెచ్చరించారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అతిపెద్ద దాడికి అమెరికా సిద్ధమవుతున్న సమయంలో ఇరాన్ తమను సంప్రదించి చర్చలకు రావాలని కోరిందని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై మరో 48 గంటల్లో స్పష్టత వస్తుందని తెలిపారు. టెహ్రాన్ అణ్వాయుధాలు కలిగి ఉండేందుకు అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోదని అధ్యక్షుడు పునరుద్ఘాటించారు. హర్మ్యూజ్ జలసంధిలో నౌకల స్వేచ్ఛాయుత రాకపోకలకు సంబంధించి ఇరాన్, ఒమన్‌తో కలిసి తాము చర్చలు జరుపుతున్నామని అగ్రరాజ్యం వెల్లడించింది. దీనిపై ఒకట్రెండు రోజుల్లో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తెలిపారు. అయితే ఈ ప్రకటనను ఇరాన్ ఖండించింది. ఒమన్‌తో తాము జరుపుతున్న చర్చల్లో అమెరికా భాగస్వామ్యం ఏమాత్రం లేదని తెలిపింది. తమ సార్వభౌమాధికారాన్ని, భద్రతా ప్రయోజనాలను కాపాడే కొత్త సముద్ర రవాణా విధానాన్ని ఏర్పాటు చేయడంపైనే ఈ చర్చలు సాగుతున్నాయని పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తాజా హెచ్చరికలు చేయడం చర్చనీయాంశంగా మారింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏ మలుపు తిరుగుతాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

# తమిళనాట తొలి బడ్జెట్ ప్రవేశ పెట్టిన విజయ్ ప్రభుత్వం

**'అన్నన్ సీర్ తిట్టమ్'నకు బడ్జెట్‌లో రూ.812 కోట్లు కేటాయింపు**

**పథకం కింద వధువుకు 8 గ్రాముల బంగారం, ఒక పట్టుచీర**




**చెన్నై,ఆగస్ట్5:** తమిళనాడు ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టింది. సీఎంగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకొచ్చిన తొలి బడ్జెట్ కావడంతో సర్వత్రా ఆసక్తి వ్యక్తమైంది. ఆర్థిక మంత్రి ఎన్. మేరీ విల్సన్ దీనిని సభ ముందుంచారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మహిళా సంక్షేమం, మౌలిక సదుపాయాలపై విజయ్ సర్కార్ ఈ పద్దులో ప్రధానంగా దృష్టిసారించింది. ఎన్నికల హామీల్లో భాగమైన 'అన్నన్ సీర్ తిట్టమ్'ను టీవీకే ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ప్రకటించింది. దానికింద వధువుకు 8 గ్రాముల బంగారం, ఒక పట్టుచీరను అందిస్తారు. ఈ పథకం కోసం రూ.812 కోట్లు కేటాయించారు. 2031 నాటికి ఐదు లక్షల మందికి కృత్రిమ మేధలో శిక్షణ ఇస్తామని ప్రకటించింది. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు ఈ శిక్షణ అందనుంది. వెట్రిథిరన్ ట్రైనింగ్ స్కీమ్ కింద దశలవారీగా లక్షమంది ఉద్యోగార్థులు నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందనున్నారు. రూ.2వేల కోట్లతో విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్స్ అందించేందుకు వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్‌ను బ్జడెట్‌లో ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ కోసం ఈ ఏడాదికి రూ.300 కోట్లు కేటాయించారు. 'పుతియా పయనం-పుతియా వేగం' పథకం కింద 11వ తరగతి చదివే 5.3 లక్షల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందించనున్నారు. వాటితో పాటు హెల్మెట్లు, వాటిల్ బాటిళ్లు ఇవ్వనున్నారు. కుటుంబ పెద్దగా ఉన్న మహిళకు ప్రతినెలా రూ.2,500, ఏడాదికి ఉచితంగా 6 వంటగ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ యువతకు ఆర్థిక సాయం, మహిళలకు అన్ని ప్రభుత్వ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం వంటి హామీలపై మాత్రం బడ్జెట్లో ప్రకటన రాలేదు.

# అవసరమైతే వందసార్లయినా అరెస్ట్ అవుతా

**• ఎవరి బెదిరింపులకు లొంగేది లేదు: ఉదయనిధి**

**చెన్నై,ఆగస్ట్5:** సినీ నటి త్రిషా కృష్ణన్‌పై చేసిన వ్యాఖ్యల వివాదంలో అరెస్టయి, విడుదలైన.. డీఎంకే సీనియర్ నేత, తమిళనాడు ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. విడుదల అనంతరం తన తండ్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌తో ఉన్న ఫొటోను సోషల్ మీడియా 'ఎక్స్'లో షేర్ చేసిన ఆయన.. రాజకీయ ఒత్తిళ్లకు తాను భయపడబోనని స్పష్టం చేశారు. 'నేను కలైంజర్ మనవడిని.. ఎంకే స్టాలిన్ కుమారుడిని.. డీఎంకే కార్యకర్తను. ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదు. రైతుల కోసం పోరాడే క్రమంలో ఒక్కసారి కాదు.. అవసరమైతే వందసార్లు అరెస్ట్ అయ్యేందుకైనా సిద్ధమే. ప్రజాసేవను ఎలాంటి అణచివేత ఆపలేదు' అని ఉదయనిధి స్టాలిన్ తన ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. అంతకుముందు.. త్రిషా కృష్ణన్‌పై ఉధయనిధి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. దీంతో మంగళవారం(ఈనెల 4న) పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం సాయంత్రం విడుదల చేశారు. ఆ తర్వాత అధికార పక్షాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారాయన.

రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం.. ప్రజల దృష్టిని మళ్లించేందుకే తనను అరెస్ట్ చేయించిందని ఆరోపించారు. తంజావూరులో తాను చేసిన ప్రసంగాన్ని వక్రీకరించి అసత్య ప్రచారం చేశారని, తప్పుడు కేసులు బనాయించి రాజకీయంగా వేధించేందుకు యత్నించారన్నారు. అరెస్ట్ చేసిన సమయంలో తానేమాత్రం భయపడలేదని, మీడియా ఎదుట ఈ చర్యను హాస్యాస్పదంగా భావిస్తున్నానని చెప్పి మరీ పోలీసులతో వెళ్లానని తెలిపారు. తానెప్పుడూ పారిపోలేదని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గబోనని చెప్పుకొచ్చారు ఉదయనిధి. లాగే గతంలో కరూర్ తొక్కిసలాట ఘటనను ప్రస్తావిస్తూ.. అధికార పక్షంపై ఉధయనిధి విమర్శలకు దిగారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించకుండా రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. తన అరెస్ట్‌ను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన డీఎంకే కార్యకర్తలు, మిత్రపక్ష, ఇతర రాజకీయ పార్టీల నేతలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

# సంక్షోభ న్యాయం!

భారత ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం తర్వాత అత్యంత గౌరవనీయమైన వ్యవస్థ ఏదైనా ఉందంటే అది న్యాయవ్యవస్థ. ప్రభుత్వం తప్పు చేసినప్పుడు ప్రశ్నించేది, పౌరుల హక్కులను కాపాడేది, అధికార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేది కోర్టులే. కానీ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు 'కొలీజియం' ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని మరోసారి బహిర్గతం చేశాయి. ప్రజల్ని 'చీమలు'గా చూసే భావజాలం ఉన్నవారు కూడా న్యాయ మూర్తులవుతున్నారని, నిజాయితీగా పనిచేసిన వారికి పదోన్నతులు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారదర్శకత లేకపోవడం వల్లనే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయన్న ఆయన మాటలు వాస్తవానికి అద్దం పడుతున్నాయి. 'న్యాయవ్యవస్థలో పారదర్శకత' అన్న అంశంపై ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన ఓ సదస్సులో ఉజ్జల్ భుయాన్ ప్రసంగించగా, ఆయన చెప్పిన అంశాలు జరుగుతున్న పరిణామాల్ని బలపరిచేలా ఉన్నాయి. భారత రాజ్యాంగం న్యాయవ్యవస్థను కార్య నిర్వాహక, శాసన వ్యవస్థల నుంచి స్వతంత్రంగా ఉంచింది. కారణమొక్కటే, అధికార దుర్విని యోగం జరిగినప్పుడు ప్రజలకు న్యాయం చేయగల చివరి సంస్థ న్యాయస్థానం కావాలి. కానీ, ఆ సంస్థలోకి ఎవరు వస్తున్నారు? ఏ ప్రమాణాలతో వస్తున్నారు? వారి రాజ్యాంగ నిబద్ధత ఏమిటి? అనే ప్రశ్నలు నేడు మరింత ముందు కొస్తున్నాయి.ఎందుకంటే, గత కొన్నేండ్లుగా కేంద్ర ప్రభుత్వ న్యాయవ్యవస్థపై ప్రభావం చూపాలనే ప్రయత్నాల పట్ల విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. కొలీజియం సిఫారసులను ఆలస్యం చేయడం, నియామకాలపై ఒత్తిడి తీసుకురావడం, న్యాయ వ్యవస్థ స్వతంత్రతపై రాజకీయ వ్యాఖ్యలు చేయడం వంటి పరిణామాలు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేలా చేస్తున్నాయి. రెండేండ్ల క్రితం అలహాబాద్ హైకోర్టు జడ్జి వ్యాఖ్యలు వివాదాస్పదమ య్యాయి. వీహెచ్‌పీ నిర్వహించిన ఓ సభలో పాల్గొనడమే కాకుండా ప్రజల్ని చీమలతో పోల్చడం, ఆ మాటలు ముస్లింలనుద్దేశించి చేశారంటూ అప్పట్లో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇలాంటి వ్యాఖ్యలతో న్యాయవ్యవస్థకు, ప్రజాప్రయోజనాలకు అపారమైన నష్టం వాటిల్లుతుంది.

# పుత్ర దోషాలను తొలగించే దొడ్డమల్లూరు నవనీత కృష్ణుడు- భక్తుడి కోసం తలతిప్పిన బాలకృష్ణుడి ఆలయం ఇదే!




పితృ దోషాలు, పూర్వీకులు చేసిన తప్పిదాల వలన కొందరు సంతాన భాగ్యానికి నోచుకోరు. అందువలన వంశాభివృద్ధికి ఆటంకం కలుగుతుంది. కొన్ని ప్రసిద్ధ క్షేత్రాల దర్శనం వలన సంతానం కలగడంతో ఉన్న దోషాలు తొలగి, సత్సంతానం కలుగుతుందని భారతీయ సనాతన ధర్మం చెబుతోంది. అందులో ముఖ్యంగా సుబ్రహ్మణ్య క్షేత్రాలు ఉంటాయి. అలాగే కొన్ని విశిష్ట క్షేత్రాల దర్శనం వలన కూడా సంతాన సంబంధిత దోషాలు తొలగుతాయి. ఈ కోవలోకి చెందిన కర్ణాటకలో ఒక విశిష్టమైన చిన్నికృష్ణుని ఆలయ విశేషాలు గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.

### దొడ్డమళూర్ నవనీత కృష్ణాలయం

కర్ణాటక రాష్ట్రం దొడ్డమళూర్ లేదా దొడ్డమల్లూరు గ్రామంలో వెలసిన నవనీత కృష్ణాలయం పుత్ర దోష నివారణా స్థలంగా చాలా ప్రసిద్ధి చెందినది. ఇక్కడ కొలువైన ప్రధాన దైవం శ్రీ అప్రమేయ స్వామి అయినప్పటికీ నవనీత కృష్ణాలయంగానే ఈ ఆలయం ప్రసిద్ధి చెందింది. బెంగుళూరు నుంచి మైసూర్ వెళ్లే మార్గంలో 58.కి.మీ దూరంలో కణ్వ నది ఒడ్డున ఈ ప్రసిద్ధ క్షేత్రం వెలసి ఉంది. ఈ ఆలయంలోని కృష్ణుడు పారాడే బాలకృష్ణుని భంగిమలో దర్శనమిస్తాడు.

### ఆలయ స్థల పురాణం

గురు రామానుజులవారు, వ్యాసరాజ తీర్థర్, గురు రాఘవేంద్ర స్వామి మొదలగు మహనీయులు పూజించిన ఈ ఆలయాన్ని దర్శించడం వలన సంతాన సంబంధిత దోషాలు తొలగుతాయని విశ్వాసం. గర్భాలయంలో సాలగ్రామ శిలతో మలచిన నవనీత కృష్ణుని ప్రతిమను వ్యాసరాయ తీర్థుల వారు ప్రతిష్టించారు.

### భక్తుని కోసం తలతిప్పిన భగవంతుడు

ఒకసారి భక్తగాయకుడు పురందరదాసు దొడ్డమళూర్ నవనీతకృష్ణుని దర్శనానికి వచ్చిన సమయంలో ఆలయం తలుపులు మూసివున్నవి. అప్పుడు పురందరదాసు వారు వెలుపల నిలబడి " జగదోద్ధారణ ఆడిసదళు యశోదా" అనే కీర్తనను ఆలపించారు. వెంటనే ఆశ్చర్యకరంగా ఆలయం తలుపులు తెరుచుకున్నాయి. గర్భగుడి సన్నిధిలో ఉన్న కృష్ణుడు లోపల నుంచి తన తల తిప్పి పురందరదాసుని తొంగి చూశాడట. అందుకే ఈనాటికి పాకుతున్న కృష్ణుడు తలతిప్పిన భంగిమలోనే దర్శనమిస్తున్నాడు

### వెన్న ఇస్తే సంతానాన్ని ప్రసాదించే నవనీత కృష్ణుడు

సంతాన భాగ్యం ఆశించి ఈ ఆలయానికి వచ్చే భక్తులు నవనీత కృష్ణునికి వెన్నను నివేదించి పూజలు చేస్తారు. తమకు సంతానం కలుగగానే బిడ్డతో వచ్చి ఆ బిడ్డ బరువుకి ఎత్తుకి సరిపడా వెన్నను తులాభారం తూచి మొక్కులు చెల్లిస్తారు. బంగారం, వెండి,కొయ్యతో చేసిన ఊయలలు కృష్ణుని సన్నిధిలో కట్టి తమ మొక్కులు తీర్చుకుంటారు.

### మైసూర్ మహారాజుకు గొప్ప అనుభవం

ఒకసారి మైసూర్ మహారాజావారు దొడ్డమళూర్ కృష్ణుని ఆలయంలో పాకుతున్న బాలకృష్ణుని సౌందర్యానికి ముగ్ధుడై ఆ విగ్రహాన్ని తీసుకుని వెళ్లి తన భవనంలో ప్రతిష్టించారు. ఆ రాత్రి మహారాజు కలలో కనిపించిన బాలకృష్ణుడు తిరిగి తన విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్టించమని లేకపోతే కోటకి అనర్థమని హెచ్చరించాడు. కానీ మహారాజు లెక్క చేయలేదు, తిరిగి విగ్రహాన్ని తరలించే ఏర్పాట్లు చేయలేదు. కృష్ణుడు స్వప్నంలో హెచ్చరించిన విధంగానే రాజభవనంలో ఒక భాగం అగ్ని జ్వాలలలో భస్మమైపోయినది. ఈ సంఘటన తరువాత మహారాజు ప్రాకుతున్న సాలగ్రామ బాలకృష్ణ ప్రతిమను తిరిగి ఆలయంలో పునఃప్రతిష్ఠించి క్షమాపణ వేడుకున్నాడు.

### సూర్య కిరణాలు

ఆలయంలోని అప్రమేయ స్వామి గర్భగుడిపై కొన్ని ప్రత్యేక రోజుల్లో ఉదయం సూర్యకిరణాలు నేరుగా పడే విధంగా ఈ ఆలయాన్ని నిర్మించారు.

### ఎలా చేరుకోవాలి?

కర్ణాటకలోని రామనగర జిల్లా, చెన్నపట్టణ తాలూకాలోని దొడ్డమల్లూరు గ్రామంలో వెలసివున్న ఈ ఆలయానికి ఇటు బెంగళూరు నుంచి లేదా, అటు మైసూరు నుంచి సులభంగా చేరుకోవడానికి మెరుగైన రవాణా సదుపాయాలున్నాయి. మనం కూడా దొడ్డమల్లూరు నవనీత కృష్ణాలయంలో నవనీత కృష్ణుని దర్శించి తరిద్దాం.

### ఓం నమో భగవతే వాసుదేవాయ! జైశ్రీకృష్ణ!

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా వ్యక్తిగత విషయం.

# అరుణాచలంలో మోక్ష మార్గం- ఇడుక్కు పిళ్లైయార్ గుహలో నుంచి వెళ్తే పాపాలు తొలగిపోతాయని ఎందుకు నమ్ముతారు?



అరుణాచలం అని పిలిచే తిరువణ్ణామలై తమిళనాడులోని ఒక సుప్రసిద్ధ శైవ క్షేత్రం. ఈ క్షేత్రం పంచభూత క్షేత్రాల్లో అగ్నిలింగంగా విరాజిల్లుతోంది. పరమశివుడు ఇక్కడ జ్యోతి స్వరూపంలో వెలిశాడని స్కంద పురాణంలో వివరించి ఉంది. 14 కిలోమీటర్ల గిరిప్రదక్షిణ అరుణాచలం విశిష్టత. అరుణాచలం గిరిప్రదక్షిణ మార్గంలో ఎన్నో విశేషాలున్నాయి. ఇడుక్కు పిళ్లైయార్ గుహ వాటిల్లో ఒకటి. ఇటీవలి కాలంలో ఎక్కువగా వార్తల్లో వినిపిస్తున్న అరుణాచలం మోక్షమార్గమైన ఇడుక్కు పిళ్లైయార్ గుహ గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.

### పేరు - నిర్మాణం

ఇడుక్కు పిళ్లైయార్ గుహ అరుణాచలం గిరి ప్రదక్షిణ మార్గంలో కనిపించే ఒక విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రదేశం. ఈ గుహకు ఆ పేరు ఎలా వచ్చిందో చూద్దాం. తమిళంలో 'ఇడుక్కు' అంటే ఇరుకైన సందు అని అర్థం. 'పిళ్లైయార్' అంటే వినాయకుడు. ఈ గుహ ఒక సాధారణ ఆలయంలా కాకుండా, పెద్ద పెద్ద బండరాళ్ల మధ్య ఉన్న అతి ఇరుకైన మార్గం. ఈ మార్గం ఒక గుహ రూపంలో ఉంటుంది.

### మోక్ష మార్గం ఎక్కడుంది?

అరుణాచలం గిరి ప్రదక్షిణ మార్గంలో కుబేర లింగం దాటిన తర్వాత ఈ గుహ వస్తుంది. ఈ గుహలో 'పిళ్లయార్' అంటే వినాయకుడు కొలువై ఉంటాయి. భక్తులు ఈ గుహను 'మోక్ష మార్గం' అని పిలుస్తారు. ఈ మోక్ష మార్గానికి సంబంధించిన స్థల పురాణాన్ని చూద్దాం.

### పురాణ ప్రాశస్త్యం

మోక్ష మార్గానికి సంబంధించిన స్థల పురాణం ప్రకారం పూర్వం ధనపాలుడనే ధనవంతుడైన వర్తకుడు తన వద్ద ఉన్న సంపద మొత్తం తనతో పాటు తీసుకుని అరుణాచలేశ్వరుని దర్శనానికి వచ్చాడు. భగవంతుని వద్దకు నిరాడంబరంగానే రావాలి. కానీ ధనపాలుడు తనకున్న సంపదతో అహంకారంతో అరుణాచలేశ్వరుని దర్శనానికి వచ్చాడు. అతడి మనస్సులో తనకున్న సంపద పట్ల మోహం, అహంకారం నిండిపోయాయి. శివపుత్రుడు వినాయకుడు ఈ పెద్దమనిషికి గుణపాఠం నేర్పించాలని అనుకున్నాడు.

### ధనపాలుని అహంకారం తొలగించిన గణపతి

ఈ క్రమంలో వినాయకుడు రెండు పెద్ద బండరాళ్ల మధ్య ఇరుకైన సందుగా అవతరించి, ధనపాలుని అహంకారాన్ని పరీక్షించదలచాడు. ధనపాలుడు ఆ ఇరుకైన రాళ్ల మధ్య నుంచి దాటి బయటకు వచ్చినప్పుడు అతడి అహంకారం తొలగి, ఆధ్యాత్మిక జ్ఞానం పొందాడని అంటారు. అటు పిమ్మట తన వద్ద ఉన్న సంపదలను దానధర్మాలకు వినియోగించి అరుణాచలం క్షేత్రంలోనే కైవల్యం పొందాడని స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ఆనాటి నుంచి ఈ ఇరుకైన గుహకు ఇడుక్కు పిళ్లైయార్ గుహ అనే పేరు ఏర్పడింది.

### పాపకర్మల నుంచి విముక్తి

ఇడుక్కు పిళ్లైయార్ గుహలో వినాయకుని దర్శించడానికి వచ్చే భక్తులు వెనుక ద్వారం నుంచి పడుకుని పాకుతూ, ముందుకు సాగి ఎదురు ద్వారం నుంచి బయటకు వస్తారు. ఇలా ఈ ఇరుకైన గుహ గుండా విజయ వంతంగా బయటకు వస్తే, పూర్వ జన్మ పాపాలు, కష్టాలు, అహంకారం తొలగిపోతాయని విశ్వసిస్తారు.

### అనారోగ్యం నుంచి విముక్తి

అలాగే ఇడుక్కు పిళ్లైయార్ గుహలో గణపతిని దర్శించి విజయవంతంగా బయటకు వస్తే నిరంతరం వేధించే శారీరక రుగ్మతలు, కీళ్ల నొప్పులు నుంచి ఉపశమనం లభిస్తుందని భక్తుల విశ్వాసం. జీవన ప్రయాణంలో ఇరుకైన మార్గంగా భావించే ఐహిక బాధల నుంచి, ప్రాపంచిక ఇబ్బందుల నుంచి ఎలా చాకచక్యంగా బయటపడాలో ఈ ఇడుక్కు పిళ్లైయార్ మార్గం సూచిస్తుందని విశ్వాసం.

### ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

ఇటీవలి కాలంలో ఒక వ్యక్తి ఈ ఇడుక్కు పిళ్లైయార్ మార్గంలో ప్రవేశించి బయటకు రాలేక ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే! అందుకే ఈ ఇడుక్కు పిళ్లైయార్?లో ప్రవేశించే ముందు కొన్ని జాగ్రత్తలు తప్పకుండా పాటించాలి. ఈ గుహ మార్గం అత్యంత ఇరుకైనది. అందుకే కొంచెం శరీర పుష్టి ఉన్నవారు, లేదా ఊపిరితిత్తుల, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు ఈ గుహలో ప్రవేశించరాదు. శరీరం సహకరించని వారు ఈ గుహ ద్వారా వెళ్లడం శ్రేయస్కరం కాదు. ఒకవేళ భౌతికంగా లోపలికి వెళ్లడం కష్టమనిపిస్తే, బయటి నుంచి వినాయకుడిని దర్శించుకుని నమస్కరించుకోవడం మంచిది. ఇడుక్కు పిళ్లైయార్ గుహకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన విశేషాలు ఇప్పుడు చూద్దాం.

### వినూత్నమైన నిర్మాణం

ఇడుక్కు పిళ్లైయార్ గుహ తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలం గిరిప్రదక్షిణ మార్గంలో ఉన్న ఒక విశిష్టమైన ప్రాంతం. ఈ గుహ ఒక వినూత్నమైన నిర్మాణంతో భక్తులను ఆకట్టుకుంటోంది. ఈ గుహలో వెలసి ఉన్న వినాయకుని దర్శించుకోవడం కోసం ఒక ఇరుకైన రాతి మార్గం నుంచి గుహ లోపలికి వెళ్లి పిళ్లైయార్ అంటే వినాయకుని దర్శించుకుని మరోవైపు నుంచి మెల్లగా పాకుతూ బయటకు రావాలి. ఈ మార్గం ఎంత ఇరుకుగా ఉంటుందంటే, మనుషులు కింద పడుకుని పాకుతూ లేదా ఒకపక్కగా ఒరిగి మాత్రమే దాటగలరు.

### నమ్మకాలు - ఆధ్యాత్మిక ప్రాముఖ్యత

దీర్ఘకాలిక వ్యాధులైన వెన్ను నొప్పి, నడుము నొప్పి, కీళ్ల నొప్పులు ఉన్నవారు, ఈ ఇరుకైన సందు గుండా పాకుతూ వెళ్లడం వల్ల నొప్పుల ఉపశమనం లభిస్తుందని భక్తుల విశ్వాసం.

### పునర్జన్మ రాహిత్యం

తల్లి గర్భం నుంచి బయటకు వచ్చిన అనుభూతిని ఈ సందు ద్వారా వెళ్లడం కలిగిస్తుందని, ఇది ఒక రకమైన శారీరక, మానసిక ప్రక్షాళన అని గురువులు, పెద్దలు చెబుతారు. ఇందువల్ల భయంకరమైన పాపాలు సైతం తొలగిపోతాయని నమ్ముతారు.

### గిరి ప్రదక్షిణలో భాగం

అరుణాచల గిరి ప్రదక్షిణ చేసే వేలాది మంది భక్తులు ఈ 'ఇడుక్కు పిళ్లైయార్' స్థలాన్ని దర్శించి, ఆ సందు గుండా వెళ్లడాన్ని ఒక ముఖ్యమైన విశేషంగా భావిస్తారు. నిజానికి లావుగా ఉన్నవారు సైతం ఈ సందు గుండా సులభంగా దాటి రావడం ఇక్కడ ఆశ్చర్యపరిచే విషయం. అయితే ఒకసారి ఒక దుర్ఘటన జరిగిన తర్వాత ఇప్పుడు ఆలయ అధికారులు ఈ గుహలో ప్రవేశించే వారిపై కొన్ని పరిమితులు విధించారు. అరుణాచలం గిరి

# అందానికి బాదం నూనె - ఇలా వాడితే జుట్టు సమస్యలూ తగ్గుతాయట!



బాదం పప్పు ఆరోగ్యానికి మంచిదని అందరికీ తెలిసిందే. అయితే, బాదం నూనెలోనూ అందానికి మేలు చేసే సహజ గుణాలెన్నో ఉన్నాయంటున్నారు నిపుణులు. ఇందులోని విటమిన్లు, ఖనిజాలు వివిధ చర్మ సమస్యల్ని దూరం చేస్తాయని చెబుతున్నారు. ఈ క్రమంలో బాదం నూనెతో సౌందర్యపరంగా చేకూరే ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

కుదుళ్లకు మసాజ్?గా : జుట్టు చివర్లు చిట్లడం, పొడిబారడం వంటి సమస్యలు చాలామందిని ఇబ్బంది పెడుతుంటాయి. ఇలాంటప్పుడు బాదం, ఆలివ్, ఆముదం నూనెల్ని సమపాళ్లలో తీసుకొని కలుపుకోవాలంటున్నారు నిపుణులు. ఈ మిశ్రమంతో కుదుళ్లను మర్దనా చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇలా వారంలో కనీసం రెండుసార్లు చేస్తే జుట్టు ఆరోగ్యంగా, ఒత్తుగా పెరుగుతుందని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో స్నానం చేయడానికి ముందు శరీరానికి బాదం నూనె రాసుకొని బాగా మర్దనా చేసుకోవాలంటున్నారు. తద్వారా ఇందులోని పోషకాలు చర్మంలోని ఇంకి శరీం -నికి మెరుపును, తేమను అందిస్తాయని తెలి యజేం అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉంటాయట. ఇవి అతినీలలోహిత కిరణాల నుంచి జుట్టుకు రక్షణ కల్పిస్తాయని చీఫ్ఱశీఖ్రీ ాఱఎత్ఖతీఎ శీట వీవఎఱఎఱఅవ పేర్కొంది. క్యూటికల్ కణాల మధ్య అంతరాన్ని పూరించడం వల్ల జుట్టు స్థితిస్థాపకత పెరుగుతుందని తెలిపింది. తీవ్రమైన 'ఒత్తిడి' ఎదుర్కొంటున్నారా? - 4 ాా'ం రూల్?తో చెక్ పెట్టొచ్చంటున్న నిపుణులు!డార్క్? సర్కిల్స్ : చాలా మందిని కళ్ల కింద డార్క్ సర్కిల్స్ ఇబ్బంది పెడుతుంటాయి. ఇలాంటి వారు రాత్రి పడుకునే ముందు కొన్ని చుక్కల బాదం నూనెను కళ్ల కింద అప్లై చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల సమస్య తగ్గే అవకాశం ఉందని అంటున్నారు.

చర్మ సమస్యలకు : బాదం నూనెలో ఎమోలియెంట్, స్క్లెరోసెంట్ లక్షణాలు ఉన్నాయట. ఇవి చర్మాన్ని మృదువుగా చేయడంతోపాటు చర్మపు రంగును మెరుగుపరుస్తాయని జుబతీశీజూవ ాాీజ పేర్కొంది. అంతే కాకుండా సోరియాసిస్, తామర వంటి పొడి చర్మ పరిస్థితులకు చికిత్స చేయడానికి బాదం నూనెను ఉపయోగించేవారని తెలిపింది. ఇంకా, శస్త్రచికిత్స తర్వాత వచ్చే మచ్చలను బాదం నూనె తగ్గిస్తుందని వెల్లడించింది.

యాంటీ ఏజింగ్? : చిన్న వయసులో వృద్ధాప్య ఛాయలతో ఇబ్బంది పడుతున్న వారికి బాదం నూనె మేలు చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇందులోని పోషకాలు యాంటీ ఏజింగ్ కారకాలుగా పనిచేస్తాయంటున్నారు. దీన్ని తరచూ చర్మానికి రాసుకోవడం వల్ల ముడతలు తగ్గుముఖం పడతాయని తెలియజేస్తున్నారు.

చర్మానికి నలుగులా పెట్టుకుంటే మృతకణాలు తొలగిపోతాయని తెలియజేస్తున్నారు. దీంతో చర్మం తాజాగా మారుతుందట.మీకు అందించిన సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# టీనేజర్ల ఆలోచనలను పేరెంట్స్ - తల్లిదండ్రుల ప్రేమను పిల్లలు అర్థం చేసుకుంటే అన్నీ హ్యాపీడేసే!



టీనేజీలో ఉన్న పిల్లలు .. రెక్కలు తొడుకున్న పక్షుల్లా, రంగు రంగుల సీతాకోక చిలుకల్లా స్వేచ్ఛగా తమ లోకంలో విహరించాలనుకుంటున్నారు. దీంతో నిన్నటి వరకూ తమ చాటున పెరిగిన వాళ్ల వ్యవహారశైలి తల్లిదండ్రులకు ఓ పట్టాన మింగుడుపడదు. అలాగని తప్పంతా ఒకరిదే అనుకోవద్దంటున్నారు నిపుణులు. మరి, ఈ సమస్యకు పరిష్కారం తెలియాలంటే ఇరువర్గాలూ అర్థం చేసుకోవాల్సిన కొన్ని విషయాలు ఉన్నాయని చెబుతున్నారు. మరి,అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!పేరెంట్స్ గమనించండి :వాదించకండి : పిల్లల్ని దారికి తెచ్చుకోవడానికి మొండితనం వద్దంటున్నారు నిపుణులు. వాదనలకు అసలే దిగొద్దట. వాళ్లేం చెబుతున్నారో వినడానికి మీరు సిద్ధంగా ఉండాలని చెబుతున్నారు. ఏదైనా విషయాన్ని ముక్కు సూటిగా కుదరదంటే కుదరదని చెప్పవద్దని సూచిస్తున్నారు. ఒకవేళ మీకు ఇష్టం లేకపోతే కొన్నాళ్లు వాయిదా వేయామని చెప్పాలట. అవసరమైతే కొన్ని షరతులతో ఒప్పుకోమని సలహా ఇస్తున్నారు. ఒప్పుకొంటే అందుకు వారిపై ఉన్న ప్రేమే కారణమని వారికి అర్థమయ్యే విధంగా వ్యవహరించాలట.

బలవంతంగా వద్దు : పిల్లలతో ఏదైనా పనిని బలవంతంగా చేయించాలనుకునే కొద్దీ మరింతగా ప్రతిఘటిస్తారట. అలాగని వదిలేయమని కాదు. నెమ్మదిగా నచ్చజెప్పామంటున్నారు నిపుణులు. ఎందుకు ఇష్టపడటం లేదో తెలుసుకోమని చెబుతున్నారు. ఆ పనిలో అలవాటు పడే వరకూ మీరు తోడుగా ఉండమని సలహా ఇస్తున్నారు. ఎక్కడైనా తగ్గాల్సి వస్తే మీరే ముందుకు రావాలని పేర్కొంటున్నారు. అలాగైనా మీకు వారిపై ఉన్న ప్రేమని అర్థం చేసుకుంటారట.

వయస్సు పెరిగే కొద్దీ వేధించే చర్మ సమస్యలు - ఇలా చేస్తే సహజంగా తగ్గించుకోవచ్చుట!

ప్రత్యామ్నాయాలు ఇవ్వండి : ఎదిగే పిల్లలు, అభిప్రాయాలు, తెలుసుకోవాలంటున్నారు నిపుణులు. అలా కాకుండా ప్రతి పనిలోనూ ఇలా చేయి, అలా చేయి అని చెబుతుంటే అయిష్టత పెంచుకుంటారని హెచ్చరిస్తున్నారు. ఆ పనులు చేయకుండా ఉండేందుకు ప్రయత్నించడం లేదా వాళ్లకి నచ్చినట్లు చేయడం లాంటివి చేస్తారని తెలియజేస్తున్నారు. అందుకే, ప్రతి పనికీ కొన్ని ప్రత్యామ్నాయాలు ఇస్తే సరిపోతుందని సూచిస్తున్నారు. వారికి ఆప్షన్ ఇచ్చినట్లూ ఉంటుందని సలహా ఇస్తున్నారు. దీంతో మీరు కోరుకున్నదీ జరుగుతుందట.అజమాయిషీ వద్దు : అజమాయిషీ చేయడం వల్ల తమ ఆలోచనలకి, ఇష్టాయిష్టాలకు మీరు అడ్డుపడుతున్నారని పిల్లలు భ్రమపడే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. అలా కాకుండా, ఓ ఫ్రెండ్?గా వారితో గడపాలని సూచిస్తున్నారు. అప్పుడే, మనసు విప్పి మాట్లాడతారని తెలియజేస్తున్నారు. ఏదైనా వారికి అదే పనిగా ఉపన్యాసంలా కాకుండా సలహాలు, సూచనలు ఇస్తున్నట్లే ఏ విషయమైనా చెప్పాలని సలహా ఇస్తున్నారు. ఇంట్లో పనులు లేదా ఉద్యోగం రీత్యా మీరు టైం లేకున్నా.. రోజులో కొంత సమయం వాళ్లకు కేటాయించామంటున్నారు. ఇది మీ మధ్య బంధాన్ని బలపరుస్తుందని వివరిస్తున్నారు. పిల్లలూ ఆలోచించండి :ఆ ఉద్దేశం తెలుసుకోండి : పేరెంట్స్ అనుభవంతో చెబుతారు. సలహాలు ఇవ్వడం, ఆంక్షలు పెట్టడం వెనుక ఉద్దేశం మీ సంక్షేమమే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే, వాళ్లేం చెబుతున్నారో ఓ సారి వినాలంటున్నారు. వారి బాధ, ఆందోళనల్ని అర్థం చేసుకోమని పేర్కొంటున్నారు. ఆ తర్వాత వాళ్లకు ఏం చెప్పాలి? ఎలాంటి భరోసా ఇవ్వాలనేది మీకే తెలుస్తుందని వివరిస్తున్నారు.ఉక్రోషం వద్దు : అనుకున్నది సాధించాలనే పంతం ఉండటం మంచిదే. కానీ, ఈ ఉక్రోషం కాస్తా కోపంగా మారితే.. మాటలే తూటాలవుతాయంటున్నారు నిపుణులు. ఆ ఒత్తిడిలో ఎదుటివారు నొచ్చుకునేలా దూసుకెళ్తాయని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదిరించడం, వాదించడం వల్ల సమస్య మరింత పెద్దది అవుతుందని పేర్కొంటున్నారు. మీరు చెప్పాలనుకున్న విషయం ఏదైనా శాంతంగా చెప్పామని సూచిస్తున్నారు. మీరు కోరింది ఏదైనా ఇప్పుడే కావాలని తెలియజేస్తున్నారు. ఈ రోజే చేయాలని అనొద్దట. వారికి ఆలోచించుకునే అవకాశం ఇవ్వాలని చెబుతున్నారు. మీరు టైం తీసుకోమంటున్నారు. వారి ప్రశ్నలకు సమాధానం చెప్పితే.. కచ్చితంగా మిమ్మల్ని అర్థం చేసుకుంటారట.స్పష్టంగా చెప్పండి : మీ మనసులో వంద కోరికలు, ఆలోచనలు ఉండొచ్చు. వాటిని లోపలే ఉంచుకుని బయటికి మాత్రం వేరే విషయాలపై గొడవపడటం వల్ల ఉపయోగం ఉండదంటున్నారు నిపుణులు. మీరేం అనుకుంటున్నారో వారితో ధైర్యంగా చెప్పామని చెబుతున్నారు. అంతేకాదు, ఆ పని చేయడం వల్ల మీ హద్దుల్ని మరిచిపోననే విషయంలో వారికి భరోసా ఇవ్వమంటున్నారు. అప్పుడు వాళ్లూ మిమ్మల్ని నమ్ముతారని వివరిస్తున్నారు.రాజీ పడాల్సిందే : పేరెంట్స్, టీనేజర్లు ఇద్దరూ కొన్నిసార్లు రాజీ పడాలంటున్నారు నిపుణులు. ఎలాగంటే, ఫ్రెండ్స్?తో ఎక్కువ సమయం గడపాలనుకుంటే.. పేరెంట్స్ పెట్టిన సమయ పరిమితిని అంగీకరించాలని సలహా ఇస్తున్నారు. ఎలాంటి బంధంలోనైనా సర్దుకుపోయినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొంటున్నారు. సలహా తీసుకోండి : ప్రతి సమస్యనూ మేమే పరిష్కరించుకోగలమని అనుకోవద్దంటున్నారు నిపుణులు. కొన్నింటికి అనుభవం అవసరమని చెబుతున్నారు. అందుకే, కష్టాన్ని, ఇబ్బందుల్ని మనసులో పెట్టుకోవద్దని తెలియజేస్తున్నారు. అమ్మానాన్నలతో మనసు విప్పి మాట్లాడటం, సలహా తీసుకోవడం మంచిదట.టీనేజీ పిల్లలు స్వతంత్రంగా ఉండాలనుకోవడం, ఫ్రెండ్స్?తో గడపాలనుకోవడం సర్వసాధారణం. ఆ మార్పుని పేరెంట్స్? గుర్తించడమే కాదు, అంగీకరించాలంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మీ పిల్లలు చేసే పనులు మీకు నచ్చకపోవచ్చుట. కానీ, అవి హానికరం కానంత వరకూ చూసి చూడనట్లు వదిలేయడమే మేలని చెబుతున్నారు. అదే సమయంలో పొరపాటు జరిగినా సరే, పిల్లలు వచ్చి చెప్పుకొనే కమ్యూనికేషన్ మీ మధ్య ఉండాలని సూచిస్తున్నారు. అలాగే, పిల్లలు కూడా ఓ విషయాన్ని అర్థం చేసుకోవాలని సలహా ఇస్తున్నారు. ఈ వయసులో ఉత్సాహం, ఉద్రేకం అన్నీ ఎక్కువగానే ఉంటాయట. మీరు చేసే పని ఏదైనా సరే.. మీ కల్చర్, విలువలు, కుటుంబ పరిస్థితులకి సరిపడుతుందా? మీ ఫ్యామిలీ అంగీకరిస్తుందా అన్నది ఆలోచించుకోవాలని పేర్కొంటున్నారు. అలా కాకుండా ఇతరుల్లా మీరు ఉండాలనుకోవడం, పీర్ ప్రెజర్?లో పడి ఎదుటి వారిలా మీరూ ఉండాలని ప్రయత్నించడం మంచిది కాదని తెలియజేస్తున్నారు. ఏ సమస్య ఉన్న పేరెంట్స్?తో చెబితే సరిపోతుందని సూచిస్తున్నారు. వాళ్లు అర్థం చేసుకోవడం లేదనిపిస్తే అవసరాన్ని బట్టి మానసిక నిపుణుల సాయం తీసుకోవడం మంచిదట.

# బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పటిష్ట చర్యలు

- వలస కార్మికులు, బంధిత కార్మికుల మధ్య వ్యత్యాసంపై స్పష్టమైన అవగాహన అవసరం
- జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ







**విజయవాడ: ఆగస్టు 5,2026.**
జిల్లాలో బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. విజయవాడ కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ ఫర్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ బాండెడ్ లేబర్ సిస్టమ్ (అబాలిషన్) సమావేశంలో అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సమావేశం ప్రారంభంలో కమిటీ సభ్యులు బంధిత కార్మిక వ్యవస్థ (నిర్మూలన) చట్టం–1976 నిబంధనలు, అమలు విధానం, బాధితులను గుర్తించే ప్రక్రియ, పునరావాస చర్యలు తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు. బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి శాఖ తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ వలస కార్మికులు స్వచ్ఛందంగా ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి పనిచేస్తారని, బంధిత కార్మికులు మాత్రం అప్పులు, బెదిరింపులు, బలవంతం లేదా ఇతర పరిస్థితుల కారణంగా యాజమాన్యానికి లోబడి పనిచేయాల్సిన పరిస్థితిలో ఉంటారని వివరించారు. ఈ రెండు వర్గాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అధికారులు స్పష్టంగా గుర్తించి, వాస్తవ పరిస్థితులను నిర్ధారించిన తర్వాతే చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని క్వారీలు, ఇటుక బట్టీలు, ఇసుక బట్టీలు, ఇతర కార్మికులు అధికంగా పనిచేసే ప్రాంతాల్లో కార్మిక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు తరచూ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బంధిత కార్మిక వ్యవస్థకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. క్వారీ యాజమాన్యాలు, ఇటుక బట్టీల నిర్వాహకులు, ఇతర పరిశ్రమల యజమానులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి బంధిత కార్మిక వ్యవస్థ (నిర్మూలన) చట్టంపై సమగ్ర అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించినట్లయితే ఎదురయ్యే శిక్షలు, చట్టపరమైన పరిణామాలపై కూడా వారికి స్పష్టంగా వివరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ మాట్లాడుతూ బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలనలో స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సంబంధిత వ్యక్తులు వలస కార్మికులా, బంధిత కార్మికులా అన్న అంశాన్ని సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. రెవెన్యూ, కార్మిక, పోలీసు, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖలతో పాటు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యాన్ని సమర్థవంతంగా సాధించగలమని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కార్మిక శాఖ అధికారి జి. ధనలక్ష్మి, వాసవ్య మహిళా మండలి సోషల్ వర్కర్ కె. విజయ, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రతినిధి రమాదేవి, ఎస్సి సభ్యులు బూరుగు నారాయణ, సోషల్ వర్కర్ జి. తిరుపతిరావు, డీపీఓ మహాలక్ష్మి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి. శివరాం ప్రసాద్, డీఆర్‌డీఏ అధికారి, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వన్ డే వన్ వార్డ్ కార్యక్రమంలో పాల్గొన్న గుమస్తా మధుసూదన్





**కుత్బుల్లాపూర్,**
వన్ డే వన్ వార్డ్ కార్యక్రమం లో భాగంగా బుధవారం నాడు 279 రోడ మేస్త్రి నగర్ డివిజన్ లో సమావేశం ఏర్పాటు చేసి, స్థానికంగా ఉండే సమస్యలను అడిగి తెలుసుకున్నారు సీఎంసీ కమిషనర్ సృజన, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు గుమస్తా మధుసూదన్ పాల్గొని రోడమేస్త్రి నగర్ డివిజన్ లో నెలకొన్న డ్రైనేజీ, రోడ్లు, స్ట్రీట్ లైట్స్ సమస్యలను పరిష్కరించాలని పెండింగ్ లో ఉన్న పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని కోరారు. ప్రధానంగా శ్రీనివాస్ నగర్ లో ఉన్న స్మశాన వాటిక గురించి తెలియజేస్తూ అక్కడ ఉన్న సమస్యల గురుంచి చెప్పారు. అలాగే అక్కడికి వచ్చే వారికీ ఇబ్బంది కలగకుండా వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్ పార్టీల నాయకులు, కార్యకర్తలు, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, జనరల్ సెక్రెటరీలు, వివిధ బస్తీ ప్రజలు పాల్గొని పలు సమస్యల గురించి సిఎంసి కమిషనర్ సృజన కు తెలియజేశారు.

# ఆగస్టు 10న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: సంయుక్త కిసాన్ మోర్చా




**వరంగల్, ఆగస్టు 5** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నాయకులు పిలుపునిచ్చారు. శివనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వరంగల్‌లో తహసీల్దార్ కార్యాలయం, నర్సంపేటలో ఆర్డీవో కార్యాలయం ముట్టడి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధ హామీ, రుణ విమోచన చట్టం, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరణ, రైతులకు ప్రయోజనం చేకూరేలా పంటల బీమా పథకం అమలు తదితర డిమాండ్ల సాధన కోసం రైతులు, కార్మికులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఉత్సాహంగా అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు

- హాకీ, అథ్లెటిక్స్ పోటీలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**ఎన్‌టీఆర్ జిల్లా -- విజయవాడతేదీ: 05 ఆగస్టు, 2026**
ఎన్‌టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. బుధవారం విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎంబీపీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన హాకీ, అథ్లెటిక్స్ పోటీలతో పాటు జిల్లా జట్టు ఎంపిక పోటీలను జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పరిశీలించారు. క్రీడాకారులతో ముచ్చటించి పోటీలు జరుగుతున్న తీరుపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్ర స్థాయిలో ఎన్‌టీఆర్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. పోటీల నిర్వహణ, క్రీడాకారులకు కల్పించిన సౌకర్యాలు, మైదాన ఏర్పాట్లపై కలెక్టర్ లక్ష్మీశ డీఎస్ఏ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోటీలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించడంతో పాటు క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి జిల్లా జట్టుకు ఎంపిక చేయడం పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో జులై 15 నుంచి ఆగస్టు 26 వరకు అమరావతి ఛాంపియన్‌షిప్--2026 పోటీలు జరుగుతున్నాయి. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, యోగా తదితర 12 క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నాయి. కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను, డీఎస్‌డీవో కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
(సమాచార, పౌర సంబంధాల శాఖ, ఎన్‌టీఆర్ జిల్లా ద్వారా జారీ)

# 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌ను విజయవంతం చేయాలి: రావు పద్మారెడ్డి



**హనుమకొండ, ఆగస్టు 5** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపడుతున్న "హర్ ఘర్ తిరంగా" అభియాన్‌ను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంటెస్టెడ్ అభ్యర్థి రావు పద్మారెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని, కార్యకర్తలు ప్రతి ఇంటికి చేరుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో మాజీ మేయర్ డా. టి. రాజేశ్వర్ రావు, పులి సర్వోత్తమ్ రెడ్డి, దేవనూరి మేఘనాథ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్ఫూర్తి కార్యక్రమంలో విద్యార్థినులకు కలెక్టర్ సత్య శారద మోటివేషన్



**వర్ధన్నపేట, ఆగస్టు 5 :** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో నిర్వహిస్తున్న 'స్ఫూర్తి' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం వర్ధన్నపేట గిరిజన బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడిన కలెక్టర్, విద్యతో పాటు విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, చైతన్యం పెంపొందించుకునేలా కృషి చేయాలని సూచిస్తూ వారికి మోటివేషన్ కల్పించారు.

## ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఈనెల 8 నుండి విజయవాడ - వాడపల్లి వన్-డే టూర్ ప్యాకేజీ ప్రారంభం..

**- ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ (ట్రాన్స్‌పోర్ట్ ఛ మార్కెటింగ్) టి.ఎస్.వి. నారాయణ**

**అమరావతి /విజయవాడ05.08.2026.**
ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో ఈనెల8 (శనివారం) నుండి విజయవాడలోని సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ () కేంద్రంగా ఒక రోజు 'విజయవాడ - వాడపల్లి టూర్ ప్యాకేజీ'ని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ (ట్రాన్స్‌పోర్ట్ ఛ మార్కెటింగ్) టి.ఎస్.వి. నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు, పర్యాటకులకు ఇటువంటి ఇబ్బందులు లేకుండా అత్యంత సౌకర్యవంతమైన రవాణా, ఆహార వసతులతో ప్రణాళికాబద్ధమైన తీర్థయాత్ర అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా ఈ ప్యాకేజీని రూపకల్పన చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ?ఈ టూర్ ప్యాకేజీ ఆగస్టు 08న ఉదయం 4:00 గంటలకు విజయవాడలోని సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ వద్ద ప్రారంభమై, తిరిగి సాయంత్రం 7:00 గంటలకు విజయవాడ చేరుకుంటుందన్నారు. ప్యాకేజీ ధర పెద్దలకు రూ. 1,160/-, పిల్లలకు రూ. 1,000/-గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రుసుములో సౌకర్యవంతమైన బస్సు రవాణా ఛార్జీలతో పాటు ఉదయం అల్పాహారం మరియు మధ్యాహ్న భోజన వసతి కలిగి ఉంటాయని, అయితే ఆలయ దర్శనం టికెట్ ఛార్జీలను పర్యాటకులే స్వయంగా భరించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక యాత్రను సద్వినియోగం చేసుకోవాలనుకునే భక్తులు మరియు పర్యాటకులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో గానీ, లేదా విజయవాడ బందర్ రోడ్, లెమన్ ట్రీ హోటల్ పక్కన ఉన్న సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ (జ=ా) వద్ద నేరుగా సంప్రదించి తమ సీట్లను ముందుగానే బుక్ చేసుకోవాలనిఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ లిమిటెడ్ జనరల్ మేనేజర్ టి ఎస్ వి నారాయణ ఆ ప్రకటనలో తెలిపారు.

## నూతన ప్రైవేట్ ఐటీఐల ఏర్పాటు మరియు అదనపు ట్రేడ్లు/యూనిట్ల మంజూరుకై దరఖాస్తుల ఆహ్వానం...

**- ఉపాధి మరియు శిక్షణా శాఖ సంచాలకులు జి. గణేష్ కుమార్.**

**అమరావతి/ విజయవాడ06.08.2026.**
నూతనముగా ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణా సంస్థల (ౡతీఱఙఖ్వ ×ఒ×ం) ఏర్పాటు మరియు ఇప్పటికే ఏర్పాటు చేయబడిన పారిశ్రామిక శిక్షణా సంస్థలలో అదనపు ట్రేడ్లు / యూనిట్లు ఏర్పాటు చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉపాధి మరియు శిక్షణా శాఖ (డైరెక్టర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్) సంచాలకులు జి. గణేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.
2027-28 సంవత్సరానికి గాను డైరెక్టరేట్ జనరల్ (ఱఱఱ.ఎస్ట్ర.స్త్రశీజ.ఱఅ) వారిచే జారీ చేయబడిన నిబంధనలను అనుసరించి అర్హులైన సంస్థల నుండి దరఖాస్తులు కోరుచున్నామన్నారు. సొసైటీల రిజిస్ట్రర్డ్ యాక్ట్ ప్రకారం నమోదు చేయబడిన రిజిస్ట్రర్డ్ సొసైటీలు, రిజిస్ట్రర్డ్ ట్రస్టులు, ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు మరియు లిమిటెడ్ లయబిలిటీ పార్ట్నర్‌షిప్‌లు (=ూ=ాం) ఈ దరఖాస్తులను సమర్పించేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన సంస్థలు తమ దరఖాస్తులను సెప్టెంబర్ 30వ (30.09.2026) తేదీ లోగా అందజేయాలని ఆయన వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఇతర వివరాలను విజయవాడలోని నైపుణ్య, ఉపాధి మరియు శిక్షణా శాఖ సంచాలకులను సంప్రదించగలరని నైపుణ్య, ఉపాధి మరియు శిక్షణా శాఖ సంచాలకులు జి. గణేష్ కుమార్ ఆ ప్రకటనలో తెలిపారు.

## తొలిరోజు ప్రశాంతంగా టెట్..

**- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




**ఎన్‌టీఆర్ జిల్లా/విజయవాడతేదీ: ఆగస్టు 05, 2026**
జిల్లాకు సంబంధించి ఏపీ టెట్ (జూన్, 2026) ఆన్‌లైన్ పరీక్ష తొలిరోజు ప్రశాంతంగా ముగిసింది. బుధవారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విజయవాడ అర్బన్ పరిధిలోని పీఎస్‌సీఎంఆర్ ఇంజనీరింగ్, టెక్నాలజీ కాలేజీలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు పరీక్ష రాసేందుకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలు జరిగినన్ని రోజులు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా, పొరపాట్లకు తావులేకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. ఆగస్టు 16వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అదేవిధంగా మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో అయిదు పరీక్షా కేంద్రాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలో 2 కేంద్రాలు ఉన్నట్లు పేర్కొన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు డిపార్టుమెంటు అధికారులతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులను కూడా నియమించినట్లు వివరించారు. పరీక్ష ముగిసిన అనంతరం డీఈవో ఎల్.చంద్రకళ మాట్లాడుతూ తొలిరోజు ఉదయం 833 మంది అభ్యర్థులకుగాను 765 మంది, మధ్యాహ్నం 255 మంది అభ్యర్థులకుగాను 236 మంది హాజరైనట్లు తెలిపారు. అభ్యర్థులకు సహాయసహకారాలు అందించేందుకు, సందేహాల నివృత్తికి డీఈవో కార్యాలయంలో 93980 44628 హెల్ప్‌లైన్ నంబరు అందుబాటులో ఉన్నట్లు ఆమె తెలిపారు.

## నకిలీ నోట్ల తయారీ.. ముఠా గుట్టురట్టు

**నాగర్‌కర్నూల్, ఆగస్టు 5** రూ.500 ల నకిలీ నోట్ల కేసులో నిందితులు 8 మంది ఉన్నట్లు పోలీసులు గుర్తించా రు. వీరిలో ఏడుగురిని అదుపులోకి తీసుకోగా మరొకరు పరారీలో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. నాగర్ క ర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం అ డ్డాగా జరిగిన ఈ నకిలీ నోట్ల చలామ ణి అంశంలో అనేక ఆసక్తికరమైన కో ణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆధు నాతనమైన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానా న్ని వినియోగించిన ఈ ముఠా భాగో తం ఒక ప్రముఖ మార్కెటింగ్ సంస్థ కు ఆన్‌లైన్‌లో ఇచ్చిన ఆర్డర్ల ఆధారంగా పోలీసులు నెల రోజులు విచారణ జ రిపి డొంక కదిపారు. నకిలీ నోట్ల త యారీకి సంబంధించి ఎవరికీ అనుమానం రాకుండా వాటర్ ప్రూఫ్ తోపాటు ప్రింటింగ్ తప్పులు దొర్లకుం డా ఉండే అత్యంత నాణ్యమైన పేపర్ ను వినియోగించినట్లు సమాచారం. మొత్తం వెయ్యి పేపర్లు ఉండే ఈ షీట్ విలువ దాదాపు రూ.6వేల పైచిలుకు ఉంది. డెలివరీ చార్జీలు కూడా అదనం. ఒక్కో షీట్‌లో దాదాపు పదుల సంఖ్య లో రూ.500 నోట్లు ముద్ర అవుతాయ ని ప్రాథమికంగా గుర్తించారు. పోలీసు లు బహిరంగపర్చే అంశాలను బట్టి మిగతా వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. నకిలీ నోట్ల కేసులో బిజినేపల్లి మండలం మంగనూరు గ్రామానికి చెం దిన ఇద్దరితో పాటు మరో ఐదుగురు పోలీసుల అదుపులో ఉన్నారు. దొంగ నోట్లను అక్రమంగా తరలించే ఒక వ్య క్తి పరారీలో ఉండగా మిగతా ఐదుగు రిని కలుపుకుని మొత్తం 7మంది పోలీ సుల అదుపులో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కేసుకు సంబంధించిన మరిన్ని అంశాలు ముఠా సభ్యుల పాత నేరచరిత్ర గు రించి నేడు మీడియా ముందు వివరిం చే అవకాశాలు ఉన్నాయి.

## అతి తక్కువ ఫీజు తో "జర్నలిజం లో డిప్లొమా కోర్సు"

**విజయవాడ, ఆగస్టు, 5** చేసే మంచి అవకాశాన్ని సి.ఆర్. మీడియా అకాడమీ అందిస్తోందని ఛైర్మన్ శ్రీ ఆలపాటి సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సు ప్రత్యేకంగా వర్కింగ్ జర్నలిస్టులకోసం ఉద్దేశించినదైనా,, జర్నలిజం వృత్తిలో అభిరుచి కలిగిన డిగ్రీ ఉత్తీర్ణులైన సాధారణ అభ్యర్థులు కూడా ఈ డిప్లమా కోర్సుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ఆప్రకటలో ఆయన తెలిపారు. జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పే లక్ష్యాలకు అనుగుణంగా ఈ కోర్సును రూపొందించామన్నారు జర్నలిస్టులకు వృత్తిపరమైన విద్యార్హత ఉంటే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం ఛ మాస్ కమ్యూనికేషన్స్ ప్రొఫెసర్, ప్రస్తుత ఒంగోలు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అయిన ప్రొ. డి.వి.ఆర్.మూర్తి ఆధ్వర్యంలోని వివిధ యూనివర్సిటీల జర్నలిజం డిపార్టుమెంట్ ప్రొఫెసర్ లతో కూడిన "బోర్డు ఆఫ్ స్టడీస్" ఈ డిప్లొమా కోర్సును రూపొందించిందని ఆయన తెలిపారు. ఎలెక్ట్రానిక్, సోషల్ మీడియా ల న్యూస్ చానెళ్లకు, పత్రికలకు ఉన్నత ప్రమాణాలతో పనిచేయ గలిగిన సామర్థ్యం ఈ కోర్సును నేర్చుకోవడంద్వారా అభ్యర్థులు పొందగలరన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం ఛ మాస్ కమ్యూనికేషన్స్ విభాగం రిటైర్డ్ హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు ప్రొఫెసర్ పి. బాబీ వర్ధన్ "కోర్సు డైరెక్టర్ గా వ్యవహరిస్తారన్నారు. అదే విధంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం ఛ మాస్ కమ్యూనికేషన్స్ విభాగం హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు ప్రొ. కె. జోతిర్మయి యూనివర్సిటీ తరపున కోఆర్డినేటర్ గా వ్యవహరిస్తారన్నారు. ఈ



కోర్సు కాల వ్యవధి 6 నెలలని ఆయన తెలిపారు.
ఎంపిక చేసిన రిటైర్డ్ అధ్యాపకులు, సీనియర్ జర్నలిస్టులు చే ;క్లాసులు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం గం. 8 నుంచి 9 వరకు, 9 నుంచి 10 వరకు రెండు క్లాసులు జరుగుతాయన్నారు. ఆన్ లైన్ (కరెస్పాండెన్సు) విధానంలో ఈ క్లాసులు నిర్వహిస్తామన్నారు. కోర్సు పూర్తి అవుతున్న సమయంలో ప్రతి అభ్యర్థి కోర్సు డైరక్టర్ ఆధ్వర్యంలో అస్సైన్ మెంట్స్ రాయాల్సి ఉంటుందని తెలిపారు. పరీక్షల్లో అభ్యర్థులు పొందిన మార్కులకు అస్సైన్మెంట్ మార్కులు కలిపి తుది ఫలితాలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వెల్లడిస్తుందన్నారు. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు నాగార్జున యూనివర్సిటీ డిప్లొమా సర్టిఫికెట్ జారీ చేస్తుందన్నారు. ఇందుకోసం మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లు ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయన్నారు.
వర్కింగ్ జర్నలిస్టులు డౌన్ లోడ్ చేసుకున్న దరఖాస్తు లో తమ వివరాలు నింపి ఇంటర్ మీడియట్ సర్టిఫికెట్, అక్రిడిటేషన్ కార్డు లేదా ఐ.డి.కార్డు లేదా సర్వీసు ధ్రువీకరణ పత్రం జెరాక్స్ కాపీ లను సెక్రెటరీ, సి.ఆర్. మీడియా అకాడమీ పేరున తీసిన రూ..2000/- డిమాండ్ డ్రాఫ్ట్ ను జతపరచి అప్లికేషనలను పంపుకోవాలని ఆయన సూచించారు. జర్నలిజం పై అభిరుచి కలిగిన ఇతర అభ్యర్థులు దరఖాస్తు తో డిగ్రీ సర్టిఫికేట్, సెక్రెటరీ సి.ఆర్.మీడియా అకాడమీ పేరున తీసిన రూ..2500/- డిమాండ్ డ్రాఫ్ట్ ను జతపరచి పంపుకోవాలని సూచించారు.
దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులు లింక్ ను క్లిక్ చేసి దరఖాస్తును డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలు కూడా ఈ లింక్ లో పొందుపరచామన్నారు. దరఖాస్తులను దిగువ చిరునామాకు పంపుకోవాల్సిందిగా ఆయన పేర్కొన్నారు.
సెక్రెటరీ, ఆంధ్ర ప్రదేశ్ సి.ఆర్. మీడియా అకాడమీ, 40-6/4-8, 4 వ అంతస్తు, రెవెన్యూ కాలనీ, మొగల్రాజపురం, విజయవాడ. 520 010; దరఖాస్తులు పంపేందుకు చివరి తేదీ ఈ నెల (ఆగస్టు) 20 వ తేదీ అని ఆయన తెలిపారు., సెప్టెంబర్ మొదటివారం నుంచి క్లాసులు ప్రారంభ మౌతాయన్నారు.

## స్వయం ఏపీ బ్రాండ్ ఉత్పత్తులకు మార్కెటింగ్ పై మంత్రి కొండపల్లి సమీక్ష

**- మీవీజు DPR యాప్‌ను స్త్రీ నిధి యాప్‌తో అనుసంధానంపై చర్చ**
**- ప్రాసెసింగ్ చార్జీల మాఫీపై SHG మహిళలకు అవగాహన కల్పించాలన్న మంత్రి**



**అమరావతి / విజయవాడ, ఆగస్టు 5 :**
స్వయం ఏపీ బ్రాండ్ కింద =ాం+ మహిళలు తయారు చేసిన 65 ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువచ్చేందుకు ఉన్న అన్ని అవకాశాలు పరిశీలిస్తున్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల



సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మంత్రి విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో సెర్ప్ డైరెక్టర్లతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి =ాం+ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఎగుమతి, ముడిసరుకులు దిగుమతి చేసుకునే అవకాశాలు తెలుసుకునేందుకు ాూాచీ=ూతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రిక్ వాహన నమూనాలో సౌరశక్తితో నడిచే మొబైల్ లాండ్రీ యూనిట్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి దానిని ్రవీజు+ూ కింద ఒక సంస్థాగత వ్యాపారంగా ప్రోత్సహించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 5 లక్షల మహిళలచే వ్యాపార, సేవా మరియు పారిశ్రామిక సంస్థలను ఏర్పాటు చేసే పురోగతిపై సమీక్షించి... గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి "ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త " దృక్పథానికి అనుగుణంగా కార్యక్రమ అమలు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.గ్రామ పంచాయతీల్లోని ప్రధాన ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించి, అక్కడ లైవ్‌లీహుడ్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని... గ్రామీణ మహిళలు మరియు యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందేలా చూడాలని అధికారులకు సూచించారు. చీ=ావీ కింద ఫీూ స్థాయిలో స్థాపించిన 163 కస్టమ్ హైరింగ్ సెంటర్ల (జఎజం) పనితీరును సమీక్షించి, రైతులకు గరిష్ఠ ప్రయోజనం కలిగేలా అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు.మీవీజు అభివృద్ధి చేసిన ఖూ= తయారీ యాప్‌ను స్త్రీ నిధి యాప్‌తో అనుసంధానంతో పాటు, =ాం+ బ్యాంక్ లింకేజీ ప్రగతిని సమీక్షించి, =ాం+ సభ్యులకు సంస్థాగత రుణాలు సులభంగా, నిరంతరంగా అందేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని మంత్రి సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, కెనరా బ్యాంక్‌లు =ాం+ క్యాష్ క్రెడిట్ లిమిట్ (జజూ) రుణాలపై వసూలు చేస్తున్న లోన్ ప్రాసెసింగ్ ఛార్జీలు, డాక్యుమెంటేషన్ ఛార్జీలు, ఇన్స్పెక్షన్ ఛార్జీల మినహాయింపు గురించి =ాం+ మహిళలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అర్హత కలిగిన అన్ని =ాం+లు ఈ మినహాయింపుల ప్రయోజనాన్ని పూర్తిగా పొందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి ఆదేశించారు.

## జనగణన--2027 సన్నాహక కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలి

**- జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ అత్యంత ప్రామాణికమైన పత్రము**
**- గ్రామాలు, పట్టణాల్లోని ప్రతి ప్రాంతం -- ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి**
**- జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు భాగస్వాములు కావాలి**
**- క్షేత్రస్థాయిలో నాణ్యమైన సమాచార సేకరణతోనే ఖచ్చితమైన గణాంకాలు సాధ్యం**
**..... జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**




**విజయవాడ: ఆగస్టు 5,2026.**
జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ అత్యంత ప్రామాణికమైన పత్రమని, గ్రామాలు, పట్టణాల్లోని ప్రతి ప్రాంతం, ప్రతి రంగానికి సంబంధించిన సమగ్ర సమాచారంతోనే భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలు సమర్థవంతంగా రూపొందించవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు.స్థానిక కలెక్టరేట్‌లోని ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో బుధవారం జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ నమోదుపై జిల్లాలోని స్టాటిస్టికల్ అధికారులకు నిర్వహించిన ఒకరోజు కార్యశాలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ జిల్లా అభివృద్ధి ప్రణాళికలకు ప్రామాణిక ఆధార పత్రంగా ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లోని ప్రతి ప్రాంతానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు తదితర రంగాలకు సంబంధించిన ఖచ్చితమైన సమాచారం అందుబాటులో ఉంటేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ప్రతి ఒక్కరూ చురుకుగా భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో నాణ్యమైన సమాచార సేకరణ, నమోదు ప్రక్రియలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి వివరాన్ని క్షేత్రస్థాయిలో ధృవీకరించిన అనంతరమే నమోదు చేయాలని ఆదేశించారు. జనగణన--2027 సన్నాహక కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని పేర్కొన్న కలెక్టర్, మండల స్థాయి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి విడతల వారీగా సమగ్ర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణతో పాటు అవసరమైన ఫారాలు, మార్గదర్శకాలను ముందుగానే అందుబాటులో ఉంచి, వారి సామర్థ్యాన్ని పెంపొందించే చర్యలు చేపట్టాలని తెలిపారు. శిక్షణ ఇచ్చినంత మాత్రాన సరిపోదని, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ, ఫాలోఅప్, ధృవీకరణ వ్యవస్థలను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి సిబ్బంది సేకరించిన సమాచారాన్ని సంబంధిత శాఖల ద్వారా తప్పనిసరిగా ధృవీకరించి, ఖచ్చితమైన గణాంకాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. జనగణన ప్రక్రియలో అవసరమైన సమాచారాన్ని అన్ని సంబంధిత శాఖల నుంచి సమన్వయంతో సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శిక్షణ కార్యక్రమానికి ముందు మండల తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం




చేసుకోవడం ద్వారా క్షేత్రస్థాయి సిబ్బందిలో బాధ్యత పెరిగి, నాణ్యమైన సమాచారం అందుతుందని తెలిపారు. జనగణన ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఖచ్చితమైన, విశ్వసనీయమైన సమాచారంతో జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్‌ను అత్యంత ప్రామాణిక పత్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు.ఈ శిక్షణ కార్యక్రమానికి సహాయ స్టాటిస్టికల్ అధికారి మేక స్వాతి మాస్టర్ ట్రైనర్ గా వ్యవహరించారు.

# 2027 వన్డే ప్రపంచకప్ షెడ్యూల్ ప్రకటించిన ఐసీసీ

## ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 వరకు మ్యాచ్‌లు

వచ్చే ఏడాది సౌతాఫ్రికా వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక 2027 వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్‌కు సంబంధించి ఐసీసీ ఒక కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఈ టోర్నీకి అర్హత సాధించేందుకు నిర్వహించే క్వాలిఫైయర్స్ మ్యాచ్‌ల తేదీలను ఐసీసీ అధికారికంగా ప్రకటించింది. 10 జట్లు పాల్గొనే ఈ క్వాలిఫైయర్ రౌండ్ 2027 ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 మధ్య జరగనుంది. అయితే ఈ మ్యాచ్‌లను ఏ దేశంలో లేదా ఏ వేదికల్లో నిర్వహిస్తారనే దానిపై ఐసీసీ ఇంకా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు.ఈసారి జరగబోయే వన్డే ప్రపంచకప్‌ను ఐసీసీ సరికొత్త ఫార్మాట్‌లో నిర్వహించబోతోంది. ఈ మెగా టోర్నీలో మొత్తం 14 జట్లు పోటీపడనున్నాయి. క్వాలిఫైయర్‌లో గెలిచిన టాప్ టీమ్ నేరుగా ఈ 14 జట్ల ప్రధాన గ్రూప్‌లో చోటు దక్కించుకుంటుంది. ఇక క్వాలిఫైయర్స్ పాయింట్ల పట్టికలో రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచే జట్ల మధ్య సూపర్ సిరీస్ పోరు జరుగుతుంది. ఇది ప్రపంచకప్ మొదటి రౌండ్‌గా పరిగణించబడుతుంది. ఈ రౌండ్‌లో విజయం సాధించిన జట్లు ఆ తర్వాత టాప్-12 లోకి అడుగుపెడతాయి. ఈసారి వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్ మూడు ఆఫ్రికన్ దేశాల ఉమ్మడి ఆతిథ్యంలో జరగనుంది. సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు కలిసి ఈ టోర్నీని నిర్వహించనున్నాయి. టోర్నీలోని మొత్తం మ్యాచ్‌లను 12 వేర్వేరు స్టేడియంలలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో అత్యధికంగా 8 వేదికలు సౌతాఫ్రికాలోనే ఉన్నాయి. మిగిలిన వాటిలో 3 వేదికలు జింబాబ్వేలో, 1 వేదిక నమీబియాలో ఉన్నాయి. మెయిన్ ప్రపంచకప్ మ్యాచ్‌లు 2027 అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 వరకు జరగనున్నాయి. క్వాలిఫైయర్ రౌండ్‌లో మొత్తం 10 జట్లు పాల్గొంటాయి. సెప్టెంబర్ 30, 2026 నాటికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో చివరన ఉండే రెండు ఫుల్ మెంబర్ జట్లు (ఆతిథ్య దేశాలైన సౌతాఫ్రికా, జింబాబ్వేలు మినహా) ఈ క్వాలిఫైయర్‌లో ఆడాల్సి ఉంటుంది. వీరితో పాటు సిడబ్ల్యూసి లీగ్ 2లో టాప్-4 లో నిలిచిన జట్లు, అలాగే వరల్డ్ కప్ క్వాలిఫైయర్ ప్లేఆఫ్స్?లో టాప్-4 లో నిలిచిన జట్లు కలసి మొత్తం 10 జట్లు ఈ క్వాలిఫైయర్స్ లో తలపడతాయి. త 2023 వన్డే ప్రపంచకప్‌లో క్వాలిఫైయర్ రౌండ్‌లోనే ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించిన మాజీ ఛాంపియన్ వెస్టిండీస్‌కు మళ్లీ అలాంటి పరిస్థితే ఎదురయ్యేలా కనిపిస్తోంది. ప్రస్తుతం వన్డే ర్యాంకింగ్స్‌లో విండీస్ 10వ స్థానంలో ఉంది. సెప్టెంబర్ 30 కట్-ఆఫ్ తేదీకి ముందు కరేబియన్ జట్టు కేవలం 2 వన్డేలు మాత్రమే ఆడనుంది (అవి భారత్‌తో జరగనున్నాయి). అటు అఫ్ఘానిస్థాన్, ఐర్లాండ్ మధ్య జరిగే వన్డే సిరీస్ ఫలితాలు కూడా వెస్టిండీస్ భవిష్యత్తును శాసిస్తాయి. ఐర్లాండ్ 4-1 లేదా 5-0 తో గెలిచి, వెస్టిండీస్ భారత్‌పై రెండు వన్డేల్లోనూ విజయం సాధిస్తేనే కరేబియన్ జట్టు నేరుగా టాప్-8 కి చేరుకునే అవకాశం ఉంటుంది.

# రోహిత్ తనంతట తాను వైదొలిగే ప్రసక్తే లేదు

## • రోహిత్ శర్మ రిటైర్మెంట్ పై మహమ్మద్ కైఫ్ వ్యాఖ్యలు




భారత వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ అంశంపై టీమిండియా మాజీ ఆటగాడు మహమ్మద్ కైఫ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ తనంతట తానుగా క్రికెట్ నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని, ఒకవేళ అతన్ని తొలగించాలనుకుంటే సెలెక్టర్లే ఆ పని చేయాలని నేరుగా సవాలు విసిరాడు. 2027 ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా లేదా అనే దానిపై బోర్డు ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన ప్రకటన చేయకపోవడంపై కైఫ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాడు.సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాల వేదికగా జరగనున్న 2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా లేదా అనే ప్రశ్న అభిమానులతో పాటు విశ్లేషకులను కూడా వేధిస్తోంది. జులై 19న ఆడే మ్యాచే రోహిత్ చివరి అంతర్జాతీయ మ్యాచ్ అంటూ వచ్చిన వార్తలను బిసిసిఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా ఖండించినప్పటికీ, రోహిత్ భవిష్యత్తుపై మాత్రం మేనేజ్‌మెంట్ నుంచి ఎలాంటి అధికారిక హామీ లభించలేదు. దీనిపై కైఫ్ తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ “రోహిత్‌కు నచ్చినట్లు ఆడే స్వేచ్ఛ ఇచ్చామని చెబుతున్న కోచ్‌లు, అతను 2027 వరల్డ్ కప్ ప్లాన్స్‌లో ఉన్నాడో లేదో స్పష్టంగా ఎందుకు చెప్పడం లేదు?” అని నిలదీశాడు.గతంలో లార్డ్స్ మైదానంలో జులై 19న జరిగే వన్డేనే రోహిత్‌కు చివరిదని ప్రచారం జరిగింది. కానీ ఆ వార్తలను బీసీసీఐ ఖండించడమే కాకుండా, ఆ మ్యాచ్‌లో రోహిత్ శర్మ కేవలం 84 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 138 పరుగులతో విరవిరుచుకుపడ్డాడు. ఇది అతనికి వన్డేల్లో 34వ సెంచరీ కాగా, 2026 సంవత్సరంలో తొలి సెంచరీ. భారత్ ఆ మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికీ రోహిత్ బ్యాటింగ్‌తో విమర్శకుల నోళ్లు మూయించాడు. బోర్డు జోక్యం చేసుకోవడం, రోహిత్ సెంచరీ బాదడం వల్ల ఆ సమయంలో పెద్ద వివాదం తప్పిందని కైఫ్ పేర్కొన్నాడు.జట్టు మేనేజ్‌మెంట్, బీసీసీఐ పబ్లిక్‌గా సరైన ప్రకటన చేయకపోవడం వల్లే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని కైఫ్ అభిప్రాయపడ్డాడు. ఆటగాడి ఫామ్‌లో హెచ్చుతగ్గులు సహజమని, బోర్డు రోహిత్‌కు పూర్తి మద్దతుగా నిలబడాల్సిన అవసరం ఉందన్నాడు. బయట ఉన్నవారికి లోపల ఏం జరుగుతుందో పూర్తిగా తెలియకపోయినా, రోహిత్ శర్మ మాత్రం తనను ఎవరూ తప్పించలేరని, ఒకవేళ వెళ్లాలనుకుంటే ఆ నిర్ణయం తన చేతుల్లోనే ఉంచుకోవాలని భావిస్తున్నాడని కైఫ్ స్పష్టం చేశాడు. రోహిత్ శర్మను వన్డే జట్టులో కొనసాగించాలా వద్దా అనే విషయమై సెలెక్టర్ల మధ్య కూడా లోపల మంతనాలు జరుగుతున్నాయని, ఇంకా ఎలాంటి ఆఖరి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. రాబోయే పర్యటనలు, సిరీస్‌ల ఆధారంగా బీసీసీఐ రోహిత్ శర్మ విషయంలో ఒక స్పష్టమైన ప్రకటన చేసే అవకాశం కనిపిస్తోంది.

# చరిత్ర సృష్టించిన పాక్ ఆటగాడు అబ్దుల్లా షఫీక్




క్వీన్స్ పార్క్ ఓవల్ మైదానంలో వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు అత్యంత బలమైన స్థితికి చేరుకుంది. మొదటి ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ అబ్దుల్లా షఫీక్ అద్భుతమైన డబుల్ సెంచరీకి చేరువగా వెళ్లి 160 పరుగులతో నాటౌట్‌గా నిలిచి చరిత్ర సృష్టించాడు. అతని వీరోచిత ఇన్నింగ్స్ కారణంగా పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ తన రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 60 పరుగుల స్వల్ప ఆధిక్యంతో 6 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది.కరేబియన్ గడ్డపై వెస్టిండీస్‌పై టెస్టుల్లో 150 కంటే ఎక్కువ పరుగులు సాధించి ఏకంగా 49 ఏళ్ల క్రితం నాటి రికార్డును అబ్దుల్లా షఫీక్ తిరగరాశాడు. చివరిసారిగా 1977లో పాకిస్థాన్ దిగ్గజ ఆటగాడు మాజిద్ ఖాన్ విండీస్ గడ్డపై 167 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. ఆ తర్వాత ఇన్ని సంవత్సరాలకు అబ్దుల్లా షఫీక్ మాత్రమే మళ్లీ ఈ ఘనత సాధించాడు. కరేబియన్ గడ్డపై వెస్టిండీస్‌పై 150 ప్లస్ పరుగులు చేసిన ఐదవ పాకిస్థాన్ బ్యాటర్‌గా షఫీక్ రికార్డుల్లోకెక్కాడు. ఇక 1958లో హనీఫ్ మహమ్మద్ సాధించిన 337 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఇప్పటికీ ఇక్కడ అత్యధిక వ్యక్తిగత స్కోరుగా ఉంది.పాకిస్థాన్ ఇన్నింగ్స్ ప్రారంభంలో ఓపెనర్లు అజాన్ అవైస్ (55), ఇమామ్ ఉల్ హక్ (14) కలసి 98 పరుగులు జోడించి అవుట్ అయ్యారు. మూడో వికెట్‌కు బ్యాటింగ్‌కు వచ్చిన అబ్దుల్లా షఫీక్, కెప్టెన్ బాబర్ ఆజమ్‌తో కలిసి కొండంత భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు ఏకంగా 183 పరుగులు జోడించారు. కెప్టెన్ బాబర్ ఆజం ఎంతో నిలకడగా ఆడి సెంచరీ దిశగా సాగినప్పటికీ, బ్రాండన్ కింగ్ వేసిన అద్భుతమైన త్రోకి 88 పరుగుల వద్ద రనౌట్ అయ్యాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా అబ్దుల్లా షఫీక్ చివరి వరకు నిలబడి 160 రన్లతో పాకిస్థాన్‌ను 387 పరుగుల మార్కుకు చేర్చాడు.ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు తమ మొదటి ఇన్నింగ్స్‌లో 344 పరుగులకు ఆలౌట్ అయింది. జస్టిన్ గ్రీవ్స్ (73), రోస్టన్ చేజ్ (70) ల హాఫ్ సెంచరీలతో విండీస్ ఆ మాత్రం స్కోరైనా సాధించగలిగింది. పాకిస్థాన్ బౌలర్లలో సజిద్ ఖాన్ అత్యధికంగా 4 వికెట్లు తీసి విండీస్ నడుం విరగ్గొట్టగా, మహమ్మద్ అలీ, ఉబైద్ షా, అలీ ఉస్మాన్ తలా 2 వికెట్లు తీసి ఆకట్టుకున్నారు.పాకిస్థాన్ సాధించిన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ ఆటగాళ్లు పాక్ బౌలర్ల ధాటికి నిలవలేకపోయారు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ 6 వికెట్ల నష్టానికి కేవలం 103 పరుగులు మాత్రమే చేసింది. ప్రస్తుతం విండీస్ చేతిలో 4 వికెట్లు మాత్రమే ఉండగా, కేవలం 60 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉండి ఓటమి అంచున నిలిచింది. ఈ మ్యాచ్‌ను గెలిచి రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1 తో సమం చేసే అవకాశాన్ని పాకిస్థాన్ చేజిక్కించుకుంది.

# భారత చీఫ్ సెలెక్టర్‌గా వీవీఎస్ లక్ష్మణ్!


## - అజిత్ అగార్కర్‌పై వేటుపడే అవకాశం



భారత క్రికెట్ పురుషుల సెలెక్షన్ కమిటీ చీఫ్ సెలెక్టర్‌గా మళ్లీ తెలుగు వ్యక్తి బాధ్యతలు చేపట్టబోతున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. టీమిండియా దిగ్గజ క్రికెటర్, తెలుగు తేజం, సొగసరి బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్ చీఫ్ సెలెక్టర్ పదవి రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. టీమిండియా వరుస పరాజయాల నేపథ్యంలో ప్రస్తుత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌పై వేటు పడే అవకాశం ఉంది. అతని కాంట్రాక్ట్‌ను పొడిగించేందుకు బీసీసీఐ సుముఖంగా లేదని ఓ సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్ట్ సోషల్ మీడియా వేదికగా ఓ కథనాన్ని రాయడం తీవ్ర చర్చనీయాంశమైంది. ‘భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవి ప్రమాదంలో పడింది. అతన్ని కొనసాగించేందుకు బీసీసీఐ సుముఖంగా లేదు. భారత నయా చీఫ్ సెలెక్టర్ పదవి రేసులో వీవీఎస్ లక్ష్మణ్ ముందంజలో ఉన్నారు. వీవీఎస్ లక్ష్మణ్ ఎంట్రీతో అజిత్ అగార్కర్‌కు ఉద్వాసన తప్పేలా లేదు. ప్రస్తుతం ఈ వ్యవహారం చర్చల దశలోనే ఉంది. సెప్టెంబర్‌లో జరిగే బీసీసీఐ వార్షిక సర్వ సభ్య సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. లక్ష్మణ్ చీఫ్ సెలెక్టర్‌గా ఉంటే అతని మాటలకు విలువ ఉంటుందని, రోహిత్, విరాట్ కోహ్లీ వంటి ఆటగాళ్లు కూడా అతని సలహాలు పాటిస్తారని బీసీసీఐ అధికారులు భావిస్తున్నారు. ఇటీవల టీమ్ సెలెక్షన్ విషయంలో అగార్కర్ తీసుకున్న కొన్ని నిర్ణయాలపై ప్రశ్నలు తలెత్తాయి. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని అగార్కర్‌ను కొనసాగించాలా? లేక లక్ష్మణ్‌ను తీసుకురావాలా?అనేది బీసీసీఐ బేరిజు వేస్తోంది. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్ ఫలితంపైనే ఈ నిర్ణయం ఆధారపడి ఉంది. ఒకవేళ భారత్ ఈ సిరీస్‌ను గెలిస్తే.. అగార్కర్ పదవీకాలం పొడిగించవచ్చు. రోహిత్ శర్మ రిటైర్మెంట్ వార్తలపై కూడా బీసీసీఐ పెద్దలు ఆగ్రహంగా ఉన్నారు. సెక్రటరీ దేవజిత్ సైకియా వచ్చి వివరణ ఇవ్వాల్సి వచ్చింది. ప్రస్తుతం భారత జట్టును నడిపిస్తున్న వారికి రోహిత్ శర్మ జట్టులో కొనసాగడం ఇష్టం లేదు.ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో ఎదురైన ఓటములపై ఇప్పటివరకు సమీక్షా సమావేశం జరగలేదు. ఇంగ్లండ్ పర్యటన తర్వాతే ఈ రివ్యూ మీటింగ్ జరగాల్సింది. కానీ దేజిత్ సైకియా అనారోగ్యం కారణంగా ఈ సమీక్ష సమావేశం జరగలేదని బోర్డు వర్గాలు తెలిపాయి. రాబోయే రోజుల్లో ఈ సమావేశం జరగనుంది. గంభీర్.. ఆన్‌లైన్ వేదికగా ఈ మీటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది.’అని అభిషేక్ త్రిపాఠి అనే స్పోర్ట్స్ జర్నలిస్ట్ తన కథనంలో రాసుకొచ్చాడు.2023 జూలైలో భారత చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అజిత్ అగార్కర్ పదవి కాలం ఈ ఏడాది సెప్టెంబర్‌లో ముగియనుంది. టీమిండియా సపోర్ట్ స్టాఫ్ మెంబర్స్ టీ దిలీప్, ర్యాన్ టెన్ డస్కాటే తరహాలో అజిత్ అగార్కర్‌పై బీసీసీఐ వేటు వేస్తుందా? లేక కొనసాగిస్తుందా? అనేది చూడాలి. తెలుగు రాష్ట్రాల నుంచి ఎమ్మెస్కే ప్రసాద్ చివరిసారిగా భారత చీఫ్ సెలెక్టర్‌గా వ్యవహరించారు.

# తాన్వీ, అన్మోల్ శుభారంభం

## • తొలిరౌండ్‌లోనే ఓడిన కిదాంబి శ్రీకాంత్



**సియోల్:** కొరియా ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో తైపీ ఓపెన్ ఛాంపియన్ తాన్వీ శర్మ శుభారంభం చేయగా.. మాజీ నంబర్ వన్ ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. మహిళల సింగిల్స్‌లో మూడో సీడ్‌గా బరిలోకి దిగిన తాన్వీ శర్మ చైనాకు చెందిన యువాన్ ఆన్ కీని 21-16, 21-15తో ఓడించి రెండో రౌండ్‌కు చేరుకుంది. మరో భారత షట్లర్ రక్షిత రామ్రాజ్ 22-24, 21-12, 21-13తో కొరియాకు చెందిన యూ ఏ యోన్‌ను, మాన్సీ సింగ్ 14-21, 21-19, 21-9తో కిమ్ జూ ఉన్(కొరియా) ఓడించి రెండోరౌండ్‌కు చేరారు. ఇక ఐదో సీడ్ ఇషరాని బరువా 21-18, 15-21, 21-7తో లీ సో యుల్(కొరియా), 8వ సీడ్ అన్మోల్ ఖర్బ్ హాంకాంగ్‌కు చెందిన లో సిన్ యాన్ హ్యాపీని 16-21, 21-17, 21-12తో, అశ్మిత చలిహా 22-20, 21-18తో జపాన్‌కు చెందిన రికో హిరమోటోను ఓడించి రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. పురుషుల సింగిల్స్‌లో మూడో సీడ్ శ్రీకాంత్ 20-22, 21-14, 12-21తో డానియిల్ దుబోవెంకో(ఇజ్రాయేల్)చేతిలో ఓడాడు. ఇక కిరణ్ జార్జ్, మిథున్ మంజునాథ్, తరుణ్ మన్నెపల్లి కూడా తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. కిరణ్ 15-21, 9-21తో కొరియాకు చెందిన పార్క్ సాంగ్ యాంగ్ చేతిలో, మిథున్ 11-21, 9-21తో చైనాకు చెందిన జూ షువాన్ చెన్ చేతిలో ఓడారు.

# వన్డే ప్రపంచకప్.. క్వాలిఫైయర్ తేదీలు ఖరారు



హైదరాబాద్: వన్డే ప్రపంచకప్-2027 క్వాలిఫైయర్ టోర్నమెంట్ తేదీలను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఖరారు చేసింది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికగా వచ్చే ఏడాది అక్టోబర్‌లో మెగా టోర్నీ జరగనుంది. దీని కోసం జరిగే ఈ అర్హత మ్యాచ్‌లు వచ్చే ఏడాది ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 వరకు నిర్వహించనున్నట్లు సమాచారం. అయితే, ఈ క్వాలిఫైయర్ మ్యాచ్‌లకు వేదికలను మాత్రం ఐసీసీ ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈ క్వాలిఫైయర్ టోర్నమెంట్‌లో మొత్తం 10 జట్లు తలపడనున్నాయి. ఇందులో విజేతగా నిలిచిన జట్టు నేరుగా ప్రపంచకప్ ప్రధాన టోర్నమెంట్‌కు అర్హత సాధిస్తుంది.



# 'కరికాల'గా సందీప్ కిషన్..

## రెండు భాగాలుగా భారీ ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం!

యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లో ఓ భారీ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ఆయన కథానాయకుడిగా 'కరికాల' అనే టైటిల్‌తో ఓ ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం తెరకెక్కుతోంది. బుధవారం ఈ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ రాజసం ఉట్టిపడే అవతారంలో కనిపించారు. ఓ అడవిలో గుర్రంపై కూర్చుని, చేతిలో పదునైన కత్తి పట్టుకుని శక్తివంతమైన యోధుడిగా దర్శనమిచ్చారు. పక్కనే సింహంతో అతడి గంభీరమైన లుక్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. 'శంబాల' ఫేమ్ యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఇది ఒక ఫాంటసీ చిత్రమని, భారీ విజువల్ ఎఫెక్ట్స్, విస్తృతమైన వరల్డ్ బిల్డింగ్‌తో దీన్ని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. 'కరికాల' చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారు. చాప్టర్-1ను 2027 జూలై 2న, చాప్టర్-2ను అదే ఏడాది అక్టోబర్ 28న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రానికి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు. తారాగణం, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని నిర్మాతలు తెలిపారు. ఇదిలా ఉండగా, సందీప్ కిషన్ ప్రస్తుతం 'సిగ్మా' అనే మరో చిత్రం విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. తమిళ స్టార్ హీరో విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా జూలై 31న విడుదల కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. ఇప్పుడు 'కరికాల' ప్రకటనతో సందీప్ తన కెరీర్‌లోనే ఓ భారీ ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు.

# వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' ప్రీమియర్లు !

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన తదుపరి చిత్రం 'కొరియన్ కనకరాజు' విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 7న విడుదల కానున్న ఈ సినిమాను ఒకరోజు ముందుగానే, అంటే ఆగస్టు 6న పెయిడ్ ప్రీమియర్ల రూపంలో ప్రేక్షకులకు చూపించేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కాగా, అద్భుతమైన స్పందన లభిస్తుండటం సినిమాపై ఉన్న అంచనాలకు అద్దం పడుతోంది.ఇటీవల జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్ తేజ్ ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. రేపు (ఆగస్టు 6) సాయంత్రం నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు థియేటర్లలో ప్రత్యేక పెయిడ్ ప్రీమియర్లు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. సినిమా కంటెంట్‌పై తమకు ఉన్న గట్టి నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ ముందస్తు పాజిటివ్ టాక్‌ను సంపాదించుకోవడంలో కీలకం కానుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వస్తున్న ఈ హారర్-కామెడీ చిత్రంపై ముందు నుంచీ మంచి బజ్ ఉంది. విడుదలైన ట్రైలర్, టీజర్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. దీనికి తోడు తమన్ అందించిన సంగీతం కూడా శ్రోతలను ఆకట్టుకుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ ప్రారంభమైన అడ్వాన్స్ బుకింగ్స్‌కు అనూహ్య స్పందన వస్తోంది. ఆ వారం విడుదలవుతున్న ఐదు సినిమాల్లో 'కొరియన్ కనకరాజు'పైనే అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై రాజీవ్ రెడ్డి, సాయి బాబా జాగర్లమూడి ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించారు. వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, సత్య, దక్ష నగార్కర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వరుస ఫ్లాపుల తర్వాత వస్తున్న ఈ సినిమాతో వరుణ్ తేజ్ గట్టి కమ్‌బ్యాక్ ఇస్తారని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి. ప్రీమియర్ల తర్వాత వచ్చే టాక్, ఆయన కెరీర్‌కు ఎంతవరకు బూస్ట్ ఇస్తుందో చూడాలి.






# రాజకీయాలపై శోభిత ధూళిపాళ సంచలన వ్యాఖ్యలు

ప్రముఖ నటి, అక్కినేని నాగచైతన్య భార్య శోభితా ధూళిపాళ తన రాజకీయ భావజాలంపై చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియా వ్యాప్తంగా విపరీతమైన చర్చకు దారితీస్తున్నాయి. "నాకు వామపక్ష భావజాలం చాలా ఎక్కువ. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కమ్యూనిజమే కచ్చితంగా విజయం సాధిస్తుంది" అని ఆమె చెప్పిన మాటలు పెను దుమారమే రేపాయి.గ్లామర్ ఇండస్ట్రీలో ఉంటూ, తమ కెరీర్ దెబ్బతింటుందనే భయంతో ఏ హీరోయిన్ కూడా పొలిటికల్ ఐడియాలజీని బయటకు చెప్పేందుకు ఇష్టపడరు. అలాంటిది శోభితా ధూళిపాళ ఎలాంటి దాపరికం లేకుండా, అత్యంత ధైర్యంగా తన మనసులోని అభిప్రాయాలను బయటపెట్టడంపై కొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు. వ్యక్తిగత భావ ప్రకటన స్వేచ్ఛకు గౌరవం ఇస్తూ ఆమె నిజాయతీని కొనియాడుతున్నారు.అయితే, మరికొందరు నెటిజన్లు మాత్రం ఆమె వ్యాఖ్యలపై తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. చిత్ర పరిశ్రమలో నటిగా ఉంటూ, అత్యంత విలాసవంతమైన లైఫ్‌స్టైల్‌ను గడుపుతున్న శోభిత... కమ్యూనిజం గురించి మాట్లాడటం సరికాదని కామెంట్స్ చేస్తున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఆమె చెప్తున్న సిద్ధాంతాలు ఆచరణాత్మకంగా ఎంతవరకు సాధ్యమని ప్రశ్నిస్తున్నారు.ఇక సినిమాల విషయానికి వస్తే, నాగచైతన్యతో వివాహం తర్వాత కొంత విరామం తీసుకున్న శోభిత..జ 'చీకటిలో', 'క్రాస్ రోడ్స్' వంటి ప్రాజెక్టులతో అలరించారు. ప్రస్తుతం ఇవి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం 'సిల్ బట్టా', 'వెట్టువం' వంటి వినూత్న చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.

# ఉదయనిధి స్టాలిన్ సినిమాకు త్రిష నో చెప్పారా?



కొన్నాళ్ల క్రితం హిందూ మతంపై చేసిన వ్యాఖ్యలతో కొన్నాళ్లు వార్తల్లో నిలిచిన డీఎంకే శాసనసభాపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తాజా వివాదంతో మళ్లీ వార్తల్లో కెక్కారు. సినీ నటి త్రిషపై ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన అరెస్టవడం, బెయిల్‌పై విడుదలవడం మనకు తెలిసిందే. ఈ వివాదం నేపథ్యంలో, గతంలో వీరిద్దరి కాంబినేషన్ గురించి వెలువడిన వార్తలు మళ్లీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఉదయనిధి సినిమాలో నటించేందుకు త్రిష నిరాకరించారని, రూ. 12 కోట్ల పారితోషికం ఆఫర్‌ను రిజెక్ట్ చేశారనే ప్రచారం మళ్లీ తెరపైకి వచ్చింది.2018లో దర్శకుడు కె.ఎస్. అధియమాన్ దర్శకత్వంలో 'ఏంజెల్' అనే టైటిల్‌తో ఒక సినిమా రాబోతుందని, అందులో త్రిష కథానాయికగా నటిస్తోందని వార్తలు రాగా, ఆ వార్తల్లో నిజం లేదని అప్పట్లోనే చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇక ఇటీవల ఉదయనిధికి చెందిన రెడ్ జెయింట్ మూవీస్ నిర్మాణంలో నటించేందుకు త్రిషకు రూ. 12 కోట్లు ఆఫర్ చేశారనే వార్త నెట్టింట చక్కర్లు కొట్టినప్పటికీ, దీనిపై త్రిష లేదా రెడ్ జెయింట్ సంస్థ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మీడియా సైతం దీనిని కేవలం ఒక పుకారుగా లేదా నిర్ధారణ లేని అంశంగానే పేర్కొంది.

# తాను చదువుకున్న స్కూల్‌కు ధనుష్ అపురూప కానుక!

తాను చదువుకున్న పాఠశాలకు నటుడు ధనుష్ విలువైన కానుక అందించాడు. చెన్నైలోని సాలిగ్రామంలో ఉన్న తాయ్ సత్య మెట్రిక్యులేషన్ పాఠశాలకు మూడు అంతస్తుల కొత్త భవనాన్ని నిర్మించి విరాళంగా ఇచ్చాడు. ఈ కొత్త భవనానికి 'ధనుష్ బ్లాక్' అని పేరు పెట్టడం విశేషం.ధనుష్ పదో తరగతి వరకు ఇదే పాఠశాలలో చదివాడు. ఇటీవల కొత్త భవనం ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ధనుష్ తన స్కూల్ సహచరుడు, సినిమాటోగ్రాఫర్ కుమరన్‌తో కలిసి హాజరయ్యాడు. ఇద్దరూ 1999 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు.ఈ సందర్భంగా ధనుష్ తన ఉపాధ్యాయులందరి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నాడు. వారితో కలిసి ఫొటోలు దిగాడు. ఈ దృశ్యాలు అక్కడున్న వారిని భావోద్వేగానికి గురిచేశాయి.ధనుష్‌తో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు కలిసి చదివిన కుమరన్, ఆయన భార్య లక్ష్మీ కృప కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కుమరన్ మాట్లాడుతూ.. పదో తరగతి వరకు తాము ముగ్గురూ ఇదే పాఠశాలలో చదివామని చెప్పాడు. ఆ తర్వాత ధనుష్‌తో కలిసి మరో పాఠశాలలో ఇంటర్ పూర్తి చేశానన్నాడు. ధనుష్ సినీ రంగంలోకి వెళ్లగా, తాను ఇంజినీరింగ్ పూర్తి చేసి తర్వాత సినిమాటోగ్రాఫర్‌గా మారినట్టు తెలిపాడు. 'తంగమగన్' వంటి చిత్రాల్లో ధనుష్‌తో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేశాడు.పాఠశాల భవనాల పరిస్థితి గురించి తెలుసుకున్న ధనుష్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కొత్త భవనం నిర్మించారని కుమరన్ చెప్పాడు. అంతేకాదు, పాత భవనాలను పునరుద్ధరించడంతో పాటు ఖాళీ స్థలాల్లో మరిన్ని కొత్త భవనాలు కూడా నిర్మిస్తానని ధనుష్ హామీ ఇచ్చాడని వెల్లడించాడు. ఆయన చేసిన సాయం తమను ఎంతో కదిలించిందని అన్నాడు.ఇటీవల ప్రకటించిన 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో ధనుష్ నటుడిగా ఒకటి, దర్శకుడిగా మరోటి ఇలా రెండు జాతీయ అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కిస్తున్న 'ఓం' చిత్రంలో నటిస్తున్నాడు. ఈ సినిమాలో మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి కూడా కీలక పాత్ర పోషిస్తున్నాడు.




# 41 గంటలు నిర్విరామంగా షూటింగ్ లోనే కీర్తి సురేష్!

భారతీయ చలన చిత్ర పరిశ్రమలో పని గంటల వివాదం ఎంత సంచలనమైందో తెలిసిందే. సెట్ లో 8 గంటలు మించి పని చేయించుకోవడంపై చాలా మంది హీరోయిన్లు బాహాటంగా విమర్శలు చేసారు. పనికి తగ్గ పారితోషికం ఇవ్వడం లేదని..అలాంటప్పుడు ఎందుకు? పని చేయాలని మరికొంత మంది నటీమణులు తెరపైకి వచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా కీర్తి సురేష్ ఏకంగా 41 గంటల పాటు నిర్విరామంగా పనిచేసి పని తనకు భారం కాదని నిరూపించారు. వివరాల్లోకి వెళ్తే..ఒకే సమయంలో పలు చిత్రాల షూటింగ్‌లతో బిజీగా ఉండటం వల్ల తాను పడిన కష్టాలను గుర్తుచేసుకుంటూ కీర్తి సురేష్ చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి.

ఇటీవలి కాలంలో విభిన్న భాషల్లో ప్రాజెక్ట్‌లను అంగీకరిస్తున్న కీర్తి సురేష్ డేట్స్ సర్దుబాటు చేయడం కోసం ఎంతగా శ్రమించాల్సి వస్తుందో వివరించారు. ముఖ్యంగా ఒక పెద్ద ప్రాజెక్ట్ షూటింగ్ నుండి నేరుగా మరో సినిమా సెట్స్‌కు పరిగెత్తాల్సిన పరిస్థితుల్లో విశ్రాంతి లేకుండా పనిచేయాల్సి వచ్చిందని తెలిపారు. ఈ క్రమంలో ఏకంగా 41 గంటలపాటు ఎలాంటి నిద్ర లేకుండా మెలకువగానే ఉంటూ షూటింగ్‌లలో పాల్గొన్నానని సంచలన నిజం బయటపెట్టారు. చాలా సందర్భాల్లో సెట్ లో 12 గంటలకు మించి పనిచేసిన సందర్భాలున్నాయన్నారు. సినిమా పరిశ్రమ బయట నుంచి చూసే వారికి గ్లామర్‌గా కనిపిస్తుందని కానీ తెర వెనుక నటీనటులు పడే శ్రమ, పడే మానసిక , శారీరక ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. నిరంతరం ప్రయాణాలు చేస్తూ రాత్రింబవళ్లు తేడా లేకుండా పనిచేయడం వల్ల ఒక్కోసారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని తెలిపారు. అయినప్పటికీ వృత్తిపై ఉన్న అంకితభావంతోనే ఇన్ని కష్టాలను ఎదుర్కొని ముందుకు సాగుతున్నట్లు కీర్తి పేర్కొన్నారు. ప్రస్తుతం టాలీవుడ్ .. ఇతర ఇండస్ట్రీలలో నటీనటులు, సాంకేతిక నిపుణుల కోసం 8 గంటల పని గంటల నిబంధనను తీసుకురావాలనే డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి.



Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com